


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

# కరీంనగర్

పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల

మంగళవారం 24 ఫిబ్రవరి 2026 | 15 పేజీలు


## మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి

# దేవ్‌జీ లొంగుబాటు..!!



సూర్య కోరుట్ల

తెలంగాణలో మావోయిస్టు ఉద్యమ చరిత్రలో కీలక మలుపు తిరిగిందన్న వార్తలు వినిపిస్తున్నాయి. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా ప్రచారం ఉన్న తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ తెలంగాణ ఎస్ఐబీ ( స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్) పోలీసుల ముందు లొంగిపోయినట్టు సమాచారం బయటకు రావడంతో దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది. ఈ పరిణామం భద్రతా వర్గాలు, రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. 2లో





- కోరుట్ల నుండి కేంద్ర కమిటీ వరకు... ప్రస్థానం
- ఆపరేషన్ కగార్-2 నేపథ్యంలో సంచలనం
- తెలంగాణ నుంచి వెలుగులోకి వచ్చిన కీలక పరిణామం

## తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో కరీంనగర్ కమిషనరేట్ ఘన విజయం

- అభినందించిన పోలీస్ కమిషనర్

సూర్య కరీంనగర్ ప్రతినిధి

(వివరాలు లోపలి పేజీల్లో)

## పకడ్బందీగా ఇంటర్ పరీక్షలను నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

సూర్య పెద్దపల్లి ప్రతినిధి (వివరాలు లోపలి పేజీల్లో)

## ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలి

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- 25 మంది సర్వేయర్లకు లైసెన్స్ పత్రాల పంపిణీ

సూర్య రాజన్న సిరిసిల్ల. (వివరాలు లోపలి పేజీల్లో)

### మొగిలిపాలెంలో

# 'డిజిటల్ కీ' కలకలం

- సర్పంచ్‌కు తెలియకుండానే రూ.4 లక్షల డ్రా
- ఎంపీడీఓ కార్యాలయంలో మొగిలిపాలెం సర్పంచ్ ఆగ్రహం
- విచారణకు ఆదేశించిన ఎంపీడీఓ



సూర్య, తిమ్మాపూర్

తిమ్మాపూర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన నూతన సర్పంచుల సమీక్షా సమావేశం రసాభాసగా మారింది.మొగిలిపాలెం గ్రామ పంచాయతీ నిధుల వినియోగంపై సర్పంచ్ తాట్ల తిరుపతి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.గ్రామ పంచాయతీ అకౌంట్‌లో జమ అయిన (మిగతా 2లో)



### త్వరితగతిన గౌరెల్లి ప్రాజెక్టు పూర్తికి

# ప్రభుత్వం కట్టుబడి ఉంది

- రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖా మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి
- పర్యావరణ అనుమతులు త్వరలోనే
- భూసేకరణ ప్రక్రియ వేగవంతం చెయ్యాలి
- జూన్ 2 కు ముందే భూసేకరణకు నిధులు

సూర్య కరీంనగర్ ప్రతినిధి

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రాధాన్యత క్రమంలో నిర్మించే ప్రాజెక్టులలో గౌరెల్లి ప్రాజెక్టు ముఖ్యమైనదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖా మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. లక్షా 06 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు (మిగతా 2లో)



# మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి దేవ్‌జీ లొంగుబాటు...!!



**సూర్య, కోరుట్ల**

## - ఆపరేషన్ కగార్-2 ప్రభావమేనా?

కేంద్ర ప్రభుత్వం ఇటీవల "ఆపరేషన్ కగార్" పేరుతో దేశవ్యాప్తంగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కూంబింగ్ చర్యలు చేపట్టింది. మొదటి విడత అనంతరం కొంత విరామం ప్రకటించగా, రెండు రోజుల క్రితం "ఆపరేషన్ కగార్--2" పేరుతో మళ్లీ ఆపరేషన్లు వేగవంతం అయ్యాయి. ఈ నేపథ్యంలో దేవ్ జీ లొంగుబాటు వార్త ప్రాధాన్యం సంతరించుకుంది.భద్రతా వర్గాల అంచనాల ప్రకారం, నిరంతర కూంబింగ్ చర్యలు, ఆర్థిక వనరుల కొరత, అండర్‌గ్రౌండ్ నాయకత్వంపై పెరిగిన ఒత్తిడి వంటి అంశాలు కీలక నాయకులను లొంగుబాటుకు దారి తీస్తున్నాయని భావిస్తున్నారు.

## - కోరుట్ల నుండి కేంద్రకమిటీ వరకు ప్రస్థానం..

## - కోరుట్లకు చెందిన తిరుపతి -- విప్లవ ప్రస్థానం

జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణానికి చెందిన తిప్పిరి తిరుపతి 1982–1983 ప్రాంతంలో నక్సలైట్ ఉద్యమంలో అండర్‌గ్రౌండ్‌కి వెళ్లినట్టు సమాచారం. కాలేజీ దశలో ఆయన రాడికల్ విద్యార్థి ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు.ఆ కాలంలో ముఖ్యంగా అఖిల భారతీయ విద్యా పరిషత్ (ఏబీవీపీ) మరియు రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) మధ్య తీవ్ర సైద్ధాంతిక విభేదాలు చోటుచేసుకున్నాయి. విద్యార్థి రాజకీయాలు ఉధృతంగా సాగిన ఆ కాలంలో పోలీసు అరెస్టులు, పరస్పర ఘర్షణలు పెరిగాయి.ఈ నేపథ్యంలో కొందరు విద్యార్థి నాయకులు అండర్‌గ్రౌండ్‌కు వెళ్లారు. వారిలో ముక్క వెంకటేశం, ఎండి నిజాముద్దీన్, తిప్పిరి తిరుపతి ప్రముఖులు. కొందరు తరువాత లొంగిపోగా, మరికొందరు ఎన్కౌంటర్లలో మరణించారు. అయితే తిరుపతి మాత్రం అండర్‌గ్రౌండ్ కార్యకలాపాల్లో కీలక బాధ్యతలు చేపట్టి, క్రమంగా మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ స్థాయికి ఎదిగాడన్న ప్రచారం ఉంది.

## కేంద్ర కమిటీ స్థాయి నేత లొంగుబాటు -- ఎంతటి ప్రభావం?

మావోయిస్టు పార్టీ నిర్మాణంలో కేంద్ర కమిటీ అత్యున్నత స్థాయి. ఆ స్థాయిలో ఉన్న వ్యక్తి లొంగిపోవడం సంస్థాగతంగా పెద్ద దెబ్బగా భావించవచ్చు. ముఖ్యంగా తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టు కార్యకలాపాలపై దీని ప్రభావం ఉండొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.కేంద్ర కమిటీ సభ్యుడు రాజిరెడ్డి సహా మరో పదహారు మందితో కలిసి తిరుపతి తెలంగాణ స్పెషల్ బ్రాంచ్ ముందు లొంగిపోయియారు, మరికొందరు కీలక నాయకులు కూడా త్వరలో లొంగే అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతోంది.

కుటుంబ సభ్యుల విజ్ఞప్తి తిప్పిరి తిరుపతి ప్రాణాలకు ఎలాంటి హాని కలగనీయవద్దని ఆయన తమ్ముడు మరియు కుటుంబ సభ్యులు సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వాన్ని వేడుకున్నారు. చట్టపరమైన విధానాలు అనుసరించి ఆయనకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.



## - కదిలించిన తిప్పిరి తిరుపతి తమ్ముడి కూతురు సుమ కథనాలు

తిప్పిరి తిరుపతి తమ్ముడు గంగాధర్ కూతురు సుమ బీటెక్ చదువుతుంది,కగార్ మొదలైనప్పుడు సుమ తన ఇంస్టాగ్రామ్ లో ఆపరేషన్ కరార్ పై మంచి కథనం పోస్ట్ చేసింది,అప్పటి నుండి దేవ్ జీ గురించి చర్చ ఎక్కువ జరిగింది. తన పెద్దనాన్న ఎక్కుడున్న ఇంటికి రావాలని,తన పెద్దనాన్నను తమకు అప్పజెప్పాలని కోరారు,అయితె హిడ్మా ఎన్కౌంటర్ జరిగినప్పుడు అందులో దేవ్ జి కూడా ఉన్నాడని ప్రచారం జరిగినప్పుడు ఒకంత ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఇప్పుడు దేవ్జి పోలీసుల ఎదుట లొంగిపోయాడని తెలిసి ఎంతో సంతోషపడుతున్నారు 40 సంవత్సరాలుగా పట్టణాన్ని వీడి అరణ్యం దారి పట్టిన తన అన్న త్వరలోనే రానున్నాడని తెలిసి ఎంతో ఆనందాన్ని వెలిబుచ్చుతున్నారు

## - మావోయిస్టు ఉద్యమం అంతిమ దశలోనా...?

గత కొన్నేళ్లుగా మావోయిస్టు ప్రభావం క్రమంగా తగ్గుముఖం పట్టిందని భద్రతా వర్గాలు పేర్కొంటున్నాయి. కీలక నాయకుల లొంగుబాట్లు, ఎన్కౌంటర్లు, కొత్తగా నియామకాల్లో తగ్గుదల వంటి అంశాలు ఉద్యమంపై ప్రభావం చూపుతున్నాయి.ఈ నేపథ్యంలో దేవ్జి లొంగుబాటు వార్త నిజమైతే, అది మావోయిస్టు ఉద్యమ చరిత్రలో ఒక కీలక మలుపుగా నిలిచే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# త్వరితగతిన గౌరెల్లి ప్రాజెక్టు పూర్తికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

(మొదటి పేజీ తరువాయి)

అందించే లక్ష్యంతో మొదలు పెట్టిన ఈ ప్రాజెక్టు పర్యావరణ అనుమతులుతో పాటు న్యాయపరమైన చిక్కులు ఏర్పడడంతో పనులు మందగించాయన్నారు. అయితే అటువంటి అవంతారాలను అధిగమించి త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన సుస్పష్టం చేశారు.సిద్దిపేట జిల్లా అక్కన పెట మండలంలోనీ గౌరెల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టు పురోగతిపై సోమవారం రోజున డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో సహచర మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలసి ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర నీటిపారుదల శాఖా సలహాదారుడు ఆదిత్య దాస్ నాధ్,ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్,ఆర్‌డఆర్ కమిషనర్ శివకు మార్ నాయుడు,ఇ. ఎన్.సి జెనరల్ రమేష్ బాబు లతో పాటు కరీంనగర్ ,హనుమకొండ ,సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వరద కాలువ ద్వారా వచ్చే నీటితో సిద్దిపేట జిల్లా అక్కనపేట మండలం గౌరెల్లి గ్రామంలో 1.41 టి.యం.సిల నీటితో ఈ రిజర్వాయర్ నిర్మాణం ప్రతిపాదించగా అంచనాలు సవరించి 8.23 టి.యం.సి ల సామర్థ్యానికి పెంచి అదనపు ఆయాకట్టు సేద్యంలోకి తేవాలి అన్నది రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించి సవరించిన ప్రతిపాదనలు ప్రభుత్వం ముందు పెట్టమన్నారు.అయితే అదే సమయంలో భూసేకరణ విషయంలో రైతులకు అందించే చెల్లింపులు న్యాయబద్ధంగా ఉండడంతో పాటు సకాలంలో నిధుల మంజూరుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందని ఆయన వెల్లడించారు.గౌరెల్లి ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణకు అవసరమైన నిధులను జూన్ 2 ముందే విడుదల చేస్తామని అందుకు సంబంధించిన ప్రక్రియను సకాలంలో పూర్తి చేయలని ఆయన కరీంనగర్, హనుమకొండ, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. న్యాయపరమైన అంశాలను ఎదుర్కొంటున్న గౌరెల్లి ప్రాజెక్టుకు సంబంధించిన కేసు మరో రెండు రోజుల్లో విచారణకు రానున్న సందర్భంలో చిక్కులను అధిగమించెందుకు అవసరమైన వ్యూహం తో సిద్ధంగా ఉండాలని సమీక్షలో పాల్గొన్న అడ్వకేట్ జెనరల్‌ను ఆయన ఆదేశించారు.అనేక ఆవాంతరాలతో అర్దాంతరంగా నిలిచి పోయిన గౌరెల్లి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు అన్నివైపులా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.ఇక పై నిధుల కేటాయింపులలో కుడా ఎటువంటి అలసత్వానికి అవకాశం లేకుండా ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటు త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు.ఇదే సమీక్షలో పాల్గొన్న రవాణ,బి.సి సంక్షేమ శాఖామంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గౌరెల్లి ప్రాజెక్టు పూర్తి చేసేందుకు నిరంతరం ఒత్తిడి పెంచుతున్నామని అందుకు సంబంధించిన భూసేకరణను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.

# మొగిలిపాలెంలో 'డిజిటల్ కీ' కలకలం

(మొదటి పేజీ తరువాయి)

4 లక్షల రూపాయలను సర్పంచ్ , ఉప సర్పంచ్ కి కనీస సమాచారం ఇవ్వకుండా పంచాయతీ కార్యదర్శి డ్రా చేశారని సర్పంచ్ తిరుపతి ఆరోపించారు. డిజిటల్ కీని దుర్వినియోగం చేస్తూ నిధులను మళ్లించడంపై ఆయన మండిపడ్డారు. దీనిపై వారం రోజుల క్రితమే జిల్లా పంచాయతీ అధికారి డిపిఓ కి ఫిర్యాదు చేసినప్పటికీ, ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు.సర్పంచ్ ఆరోపణలపై మండల ప్రత్యేక అధికారి ఎన్. శ్రీధర్ మరియు ఎంపీడీఓ రాజీవ్ మల్హోత్రా స్పందించారు. ఈ వ్యవహారంపై తక్షణమే పూర్తిస్థాయి విచారణ చేపడతామని, నిధుల దుర్వినియోగం జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు.

# పథకం ప్రకారమే హత్య చేశారు...నిందితుడి అరెస్ట్..

## -15 సంవత్సరాలుగా అనుమానంతో.... - ప్రతీకారం కోసం పగ పెంచుకున్నాడు

### - గోదావరిఖని ఏసిపి మడత రమేష్

**సూర్య, సెంటినరీ కాలనీ**

రామగిరి మండలం సెంటినరీకాలనీ సింగరేణి ఫంక్షన్ హాల్ వద్ద పాత కక్షలను మనసులో ఉంచుకొని పథకం ప్రకారమే మొలుగూరి కొమురయ్య(60) హత్య చేసిన సంఘటనలో నిందితుడు బుర్ర రాజకొమురయ్య ను సోమవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు గోదావరిఖని ఏసిపి మడత రమేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నిందితుడు బుర్ర కొమురయ్య అలియాస్ రాజ కొమురయ్య సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి. బేగంపేట గ్రామంలో నివాసం ఉంటున్నాడు. 2011వ సంవత్సరంలో నిందితుడు కొడుకు బుర్ర తిరుపతి గుండారం గ్రామంలో యాక్సిడెంట్ లో చనిపోయాడు. అట్టి యాక్సిడెంట్ కారణం నిందితుడు బావ అయిన మొలుగూరి సత్తయ్య అతని అన్న మొలుగూరి కొమురయ్య వీరిద్దరి వలన నిందితుడు కొడుకు చనిపోయినాడని మనసులో తరచూ బాధపడుతూ వీరిద్దరిని ఎన్నటికైనా చంపాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. వారిని చంపాలని అనుకున్న ప్రతిసారి ఇద్దరు ఎప్పుడూ ఒకేసారి కనబడకపోవడం జరిగింది. గతంలో చాలా సార్లు నిందితుడి కొడుకు చనిపోయిన విషయంలో తరచు గొడవ పడుతూ చంపుతానని బాధితులను బెదిరించాడని తెలిపారు. ఈ నెల 21వ తేదీన బేగంపేట గ్రామం గౌడ కులానికి చెందిన బుర్ర కుమార్ స్వామి కూతురు వివాహం సెంటినరీ కాలనీలోని సింగరేణి కమ్యూనిటీ హాల్ లో జరుగగా కొమురయ్య, సత్తయ్య ఇద్దరు తప్పకుండా వస్తారని, ఆ సమయంలో వారిని కచ్చితంగా చంపాలని నిర్ణయించుకుని తన యొక్క పల్సర్ బైక్ పైన తన పెద్ద కూతురు ఎక్కించుకొని తన ఇంట్లోని కత్తిని తీసుకుని తను ముందుగా వేసుకున్న పథకం ప్రకారం తన కూతుర్ని పెళ్లి మండపం వద్ద దింపి ఫంక్షన్ హాల్



బయట వేచి ఉన్నాడు. మొలగూరి సత్తయ్య, మొలుగూరి కొమురయ్య ఇద్దరు కలిసి వారి కుటుంబ సభ్యులతో పెళ్లికి వచ్చారు. సరైన సమయం కోసం నేను ఎదురు చూస్తుండగా మధ్యాహ్నం 01:45 గంటలకు మొలుగూరి సత్తయ్య, కొమురయ్యలు ఇద్దరు కమ్యూనిటీ హాల్ నుండి బయటకు వచ్చే క్రమంలో గేటు వద్ద నిందితుడు వారికి వెనుక వైపు నుంచి వచ్చి అకస్మాత్తుగా సత్తయ్యపై తన దగ్గర గల కత్తితో దాడి చేసి అతనిని చంపడానికి ప్రయత్నం చేయగా, అతను తన కుడి చేతితో అడ్డుకొనగా దీనిపై దాదాపు రెండు మూడు సార్లు అతని చంపడానికి కుడి చేతి పై పొడిచాడు. అతను తప్పించుకునగా అతని అన్న అయిన కొమురయ్య ఛాతి ఎడమవైపు బలంగా పొడవడంతో ఆయన కింద పడిపోయాడు. తర్వాత నిందితుడు తనను ఎవరైనా పట్టుకుంటారని భయపడి పల్సర్ బండి పై కత్తి తీసుకుని అక్కడి నుంచి పారిపోవడం జరిగిందని తెలిపారు. నేరస్తుని పట్టుకోవడం లో చాకచక్యంగా వ్యవహరించిన గోదావరిఖని టు-టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ నక్కతోటి ప్రసాద్ రావు, రామగిరి పోలీస్ స్టేషన్ ఎస్ఐ టి.శ్రీనివాస్, కానిస్టేబుళ్లు బి.రాజ్ కుమార్, అశోక్ లను గోదావరిఖని ఏసిపి మడత రమేష్ అభినందించారు.



నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

రాజన్నసిరిసిల్ల

మంగళవారం 24 ఫిబ్రవరి 2026



# ప్రజావాణితో సమస్యల పరిష్కారం

## - ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ - మొత్తం 154 దరఖాస్తుల రాక

**సూర్య రాజన్న సిరిసిల్ల**



ప్రజావాణితో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటిని పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు.మొత్తం 154 దరఖాస్తులు రాగా, ఆయా శాఖల అధికారులకు పంపారు. ముందుగా గత ప్రజావాణిలో వచ్చిన అర్జీల పరిష్కారంపై ఆయా శాఖల జిల్లా అధికారులు, రెవిన్యూ, పంచాయతీ రాజ్ శాఖా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి అర్జీని పరిష్కరించాలని ఆదేశించారు.రెవెన్యూ శాఖకు 72, గృహ నిర్మాణ శాఖకు 17, జిల్లా పంచాయతీ అధికారికి 15,డీఆర్డీఓకు 8, జిల్లా సంక్షేమ శాఖకు 7, ఎండీ సెస్‌కు 6, ఎస్డీసీకి 5, జిల్లా విద్యాధికారి, ఉపాధి కల్పన అధికారికి 4 చొప్పున,సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, జిల్లా వైద్యాధికారికి మూడు చొప్పున, ఎస్పీ కార్యాలయానికి 2, జిల్లా అటవీ శాఖ అధికారి, జిల్లా ఎక్సైజ్ శాఖ, జిల్లా ట్రెజరీ శాఖ, పశు సంవర్ధక శాఖ, మున్సిపల్ కమిషనర్ వేములవాడ, సిరిసిల్ల, ఎంపీడీఓ ఎల్లారెడ్డిపేట, డీఎం ఆర్టీసీ సిరిసిల్లకు ఒకటి చొప్పున వచ్చాయి. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్ పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనం నడిపితే జైలుకే...తస్మాత్ జాగ్రత్త!

## - రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా ప్రతిరోజూ తనిఖీలు - గత 20 రోజుల్లో 364 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

## - లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించిన సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి

**సూర్య రాజన్న సిరిసిల్ల**





రాజన్న సిరిసిల్ల జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం కఠిన చర్యలకు ఉపక్రమించింది. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రతిరోజూ విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్షలతో పాటు భారీ జరిమానాలు తప్పవని సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి వాహనదారులను హెచ్చరించారు.సిరిసిల్ల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద పోలీసు శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో డీఎస్పీ నాగేంద్రచారి స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సిరిసిల్ల సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రోజూ ముమ్మరంగా వాహన తనిఖీలు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా గడిచిన 20 రోజుల్లోనే సబ్ డివిజన్ వ్యాప్తంగా ఏకంగా 364 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

**- లైసెన్సుల రద్దుకు సిఫారసు...**

మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమయ్యే వారిపై కేసులు నమోదు చేయడమే కాకుండా, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ స్పష్టం చేశారు. తనిఖీల్లో పట్టుబడిన వారి డ్రైవింగ్ లైసెన్సులను తీసుకుని, వాటి రద్దు కోసం సంబంధిత రవాణా శాఖ (ఆర్టీఏ) అధికారులకు సిఫారసు చేస్తున్నట్లు తెలిపారు. కేవలం కేసులు నమోదు చేయడమే కాకుండా, జిల్లాలో ట్రాఫిక్ నియమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, అలాగే మద్యం సేవించి పట్టుబడిన వారికి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.ఈ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ కార్యక్రమంలో సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ, ట్రాఫిక్ ఎస్.ఐ శ్రీకాంత్ మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# హెల్మెట్ ధరిస్తే 'పూల' బాట.. లేదంటే జరిమానా

**- చలాన్ల కోసం కాదు... ప్రాణ రక్షణ కోసం**

**- రోడ్డు భద్రతపై పోలీసుల వినూత్న చైతన్యం**

**సూర్య, వేములవాడ**



వేములవాడ పట్టణంలోని బ్రిడ్జి వద్ద పట్టణ సీఐ వీరప్రసాద్, ట్రాఫిక్ సీఐ మోడెం సురేష్‌ల ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియమ నిబంధనలపై వినూత్న రీతిలో వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించని వాహనదారులకు జరిమానాలు విధించి,హెల్మెట్ ప్రాముఖ్యతపై చైతన్యం కల్పించారు. హెల్మెట్ ధరించిన వాహనదారులకు పూలు అందజేసి, అభినందించారు. ఈ సందర్భంగా సీఐ వీరప్రసాద్, ట్రాఫిక్ సిఐ మోడెం సురేష్‌లు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారుల భద్రత కోసం హెల్మెట్ ధరించడం అత్యంత అవసరమని, రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రాణాలకు రక్షణ కలుగుతుందని తెలిపారు.రోడ్డు ప్రమాద సమయంలో ప్రాణాలను కాపాడే ముఖ్యమైన భద్రతా పరికరం హెల్మెట్ అని తెలిపారు. హెల్మెట్ వాడకం ద్వారా తలకు తీవ్రమైన గాయాలను నివారించవచ్చని, ప్రతి వాహనదారుడు తన కుటుంబ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, పోలీసులు జరిమానాలు విధించడానికే కాకుండా, ప్రజల ప్రాణ రక్షణ కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. హెల్మెట్ ధరించని వారు వెంటనే తమ అలవాట్లు మార్చుకుని భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, యువత ట్రాఫిక్ నియమాలను గౌరవించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ టౌన్ ఎస్సై సముద్రాల రాజు ఉన్నారు.



# పెద్దపులి సంచారంపై ఆరా తీసిన రాష్ట్ర ప్రభుత్వ విప్

**సూర్య చందుర్తి**



రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి-మోత్కూరావుపేట అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచారిస్తుంది అనే సమాచారంతో సోమవారం ఫారెస్ట్ రేంజు అధికారులను వివరాలను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అడిగి తెలుసుకున్నారు.చందుర్తి-తొర్తి అటవీ ప్రాంతంలో పాదముద్రాల గుర్తించినట్లు ప్రభుత్వ విప్ కు అటవీ శాఖఅధికారులుతెలిపారు..పెద్దపల్లి జన్నారం అడవుల నుండి బయలుదేరి యాదాద్రి భువనగిరి అడవులు మీదిగా తిరుగుతూ ప్రస్తుతం చందుర్తి మోత్కూరావుపేట అటవీ ప్రాంతంలో పాదముద్రాల గుర్తించినట్లు విప్‌కు అధికారులు తెలిపారు..పూణే నుండి వచ్చిన ప్రత్యేక బృందాలు రావడం జరిగిందనీ పెద్దపులి వేటగాళ్లు పెట్టిన ఉచ్చులని కూడా తొలగించుకుంటూ పెద్దపులినీ సురక్షితంగా ఉంచడం కోసం రెస్క్యూ సిబ్బంది పని చేస్తున్నారని విప్ కు అధికారులు తెలిపారు.ప్రభుత్వ విప్ మాట్లాడుతూ మోత్కూరావుపేట నుండి చందుర్తి జంగల్ రోడ్డు గుండా వెళ్లే వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్థానిక ప్రజల్లో భయం నెలకొన్న నేపథ్యంలో పరిస్థితిని సమీక్షిస్తూ అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అటవీ శాఖ అధికారులకు ప్రభుత్వ విప్ సూచించారు.గ్రామస్తుల భద్రత దృష్ట్యా సమీప గ్రామాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు. పులుల సంచారం ఉన్న ప్రాంతాల్లో రాత్రి వేళల్లో బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని, పశువులను సురక్షిత ప్రదేశాల్లో కట్టివేయాలని ప్రజలకు తెలియజేయాలని అన్నారు.

# ఈదురుగాలులతో భారీ వర్షం

**- కొత్తపల్లిలో వడ గండ్ల వాన, నెలకొరిగిన చెట్లు**

**- నర్మాలలో విరిగిన విద్యుత్ స్థంభం**

**సూర్య గంభీరావుపేట**



గంభీరావుపేట మండలంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. అల్పాపిడనం ప్రభావంతో సోమవారం మధ్యాహ్నం వరకు ఎండలు కొట్టి ఒక్కసారిగా ఈదురు గాలులువిస్తూ...3 గంటల ప్రాంతంలో గంభీరావుపేట, కొత్తపల్లి, నర్మాల, దేశాయిపేటతో పాటు పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. కొత్తపల్లి గ్రామంలో వడగండ్ల వర్షం కురిసింది.



ఈదురు గాలులకు భారీ వృక్షాలు నెలకు ఒరగడంతో విద్యుత్ స్తంభాలు విరిగి విద్యుత్తుకు అంతరాయం ఏర్పడింది.నర్మాల క్యాంపు దగ్గర విద్యుత్తు స్థంభం విరిగింది.

# పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

**- కంచర్ల రవి గౌడ్**

**సూర్య సిరిసిల్ల టౌన్**



ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలంటూ అసిస్టెంట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో కొన్ని ప్రైవేట్ కళాశాలలు ఫీజుల పేరుతో విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకపోవడం పట్ల కంచర్ల రవి గౌడ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.ఫీజు చెల్లించిన తరువాతనే హాల్ టికెట్ ఇస్తామంటూ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. అధికారులు సంబంధిత కళాశాలలను గుర్తించి ఎలాంటి షరతులు లేకుండా ఇంటర్ విద్యార్థులకు హాల్ టికెట్లు అందేలా చూడాలని జిల్లా అధికారులను కోరారు.అదేవిధంగా పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు మౌలిక వసతులను కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.కె అప్రోచ్, వద్లూరి వేణు,మారం కార్తికేయ, నరేంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆశ కార్యకర్తల ముందస్తు అరెస్ట్...

**సూర్య, ముస్తాబాద్**



అసెంబ్లీ సమావేశాల నేప థ్యంలో హైదరాబాద్‌లో నిరసనలు చేపట్టవచ్చనే అనుమానంతో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు.సోమవారం ఉదయం మండలంతో పాటు, పలు ప్రాంతాల్లో ఆశా వర్కర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సమావేశాల సమయంలో చట్టం,శాంతి భద్రతలకు భంగం కలగకుండా ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిని తర్వాత విడుదల చేశారు.

# బిఆర్ఎస్ సీనియర్ నాయకుని కుటుంబ సభ్యులు పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

**సూర్య బోయినపల్లి**



మండలం కోరెం గ్రామానికి చెందిన టిఆర్ఎస్ సీనియర్ నాయకుడు గడ్డం తిరుపతి రెడ్డి తండ్రి గడ్డం మల్లారెడ్డి ఈ రోజు ఉదయం అనారోగ్యంతో మృతి చెందగా మాజీ సుంకె రవిశంకర్ హాజరై మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా మృతుడి పూలమాల వేసి నివాళులర్పించారు.ఆయన వెంట సర్పంచ్ జంపుక మాధవి ఆనంద్, ఉప సర్పంచ్ స్వామి రెడ్డి,మాజీ మండల కో-ఆప్షన్, మెంబర్ మహ్మద్ ఆజ్జూ, నాయకులు సుజన్ రెడ్డి, కమల్ గౌడ్ తదితరులు ఉన్నారు.



నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

జగిత్యాల

మంగళవారం 24 ఫిబ్రవరి 2026 4


# మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట

**సూర్య, మేడిపల్లి/ భీమారం**


మేడిపల్లి, భీమారం రెండు ఉమ్మడి మండలాలలో వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సోమవారం రోజు పర్యటించారు. ఈ సందర్భంగా భీమారం మండలం గోవిందారం గ్రామంలో పది లక్షల రూపాయలతో నిర్మిస్తున్న మహిళా సమాఖ్య భవనానికి, మేడిపల్లి మండలం కొండాపూర్ గ్రామంలో 20 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న రెండు మహిళా సమైక్య భవనాలు, కట్లకుంట గ్రామంలో 30 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న మూడు సమైక్య భవనాల నిర్మాణాలకు



శంకుస్థాపనలు నిర్వహించారు. భీమారం మండలంలోని మన్నెగూడెం గ్రామంలో నిర్మాణం పూర్తి అయిన అంగన్వాడి భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆదే శ్రీనివాస మాట్లాడుతూ మహిళా సాధికారత సాధించేవరకు మన ప్రజా ప్రభుత్వం ఆడబిడ్డలకు అండగా ఉంటుందని అన్నారు. అనంతరం కట్లకుంట గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో మేడిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ ఏనుగు రమేష్ రెడ్డి, భీమారం మండలం కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ సింగిరెడ్డి నరేష్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్ కుమార్ యాదవ్, రెండు మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందించిన సర్పంచ్

**సూర్య, ఎండపల్లి**



ఎండపల్లి మండల కేంద్రానికి మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మండల కేంద్రంలోని నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఎండపల్లి సర్పంచ్ మారం సునీత జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. అలాగే, ఎండపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ భూముల హద్దుల గురించి సర్వే చేసి హద్దులు నిర్ణయించే విధంగా తహసీల్దార్ కి దరఖాస్తు అందజేయడం జరిగింది, అని వారు తెలిపారు నూతనంగా ఏర్పాటు అయిన ఎండపల్లి మండల కేంద్రంకు గత రెండు సంవత్సరాల క్రితం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేయడం జరిగింది. కానీ ఆసుపత్రికి సరిపడా భూమి ఎండపల్లిలో లేదని రాజారాంపల్లికి తరలించే ప్రయత్నం జరుగుతున్నది, కానీ మా గ్రామంలో ప్రభుత్వ భూమి ఉన్నది అయినప్పటికీ ఆసుపత్రి రాజారాంపల్లికి తరలిస్తున్నారని గత వారం రోజుల క్రితం మా గ్రామంలోని గ్రామస్తులు అందరూ సమావేశమై ఈ ఆసుపత్రి సమీప గ్రామానికి వెళ్ళినట్లయితే గ్రామస్తులు అందరం ఏకమై నిరసన తెలుపుటకు ఏకాభిప్రాయానికి రావడం జరిగిందని, పై గ్రామ సమస్యలను పరిశీలించి ఎండపల్లి గ్రామానికి మంజూరైన ఆసుపత్రిని ఎండపల్లిలోనే నిర్మాణం చేపట్టే విధంగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయగలరని కోరడం జరిగింది. అలాగే వీలైనంత త్వరగా సర్వే జరిపించి ప్రభుత్వ భూముల హద్దులు నిర్ణయించుట,అలాగే నూతనంగా ఏర్పడిన ఎండపల్లి మండల కేంద్రంలో వివిధ కార్యకలాపాలకు వచ్చు ప్రజలకు అలాగే ప్రభుత్వ ఉద్యోగులకు ఇబ్బందికరంగా ఉన్న దృష్ట్యా బస్టాండ్ నిర్మాణం ఎక్స్‌ప్రెస్ బస్సులు నిలుపుదల చేయాలని వినతి పత్రం అందించామని సర్పంచ్ మారం సునీత తెలిపారు.

## ఈడబ్ల్యూఎస్ 10శాతం రిజర్వేషన్లు పూర్తి స్థాయిలో అమలు చేయాలి

**సూర్య, జగిత్యాల అర్బన్**

దేశంలో అగ్రవర్ణాలు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక అన్యాయాలను ప్రభుత్వం గుర్తించి న్యాయం చేయాలని ఓసి సామాజిక సంక్షేమ సంఘం జగిత్యాల జిల్లా కన్వీనర్ మహంకాళి రాజన్న డిమాండ్ చేశారు. ఓసీ సంక్షేమ సంఘాల ఐక్యవేదిక, న్యూఢిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద సోమవారం మహా ధర్నా నిర్వహించారు.ఈ ధర్నాలో రాజన్న, సిహెచ్ వెంకట ప్రభాకర్ రావులు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లకు పైగా గడిచినా ఓసి వర్గాలు అనేక రంగాల్లో వెనుకబాటుకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదని వారు విమర్శించారు. న్యాయమైన రాజ్యాంగం హామీ ఇచ్చిన సమానత్వ సూత్రాలను అమలు చేయకుండా ప్రభుత్వాలు



నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని రాజన్న ప్రభాకర్ రావులు ఆరోపించారు. ఓసి వర్గాల సమస్యలపై అన్ని రాజకీయ పార్టీలు స్పష్టమైన వైఖరి ప్రకటించాలని, రాబోయే కాలంలో ఈ అంశాన్ని ప్రజా ఉద్యమంగా తీసుకెళ్తామని వారు హెచ్చరించారు. ఈ ధర్నాలో జాతీయ ఓసి జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు, చైర్మన్ నల్ల సంజీవరెడ్డి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్ రెడ్డి, బద్దురి వెంకటేశ్వర్ రెడ్డి,జగిత్యాల జిల్లా ఓసి ప్రతినిధులు సిరిసిల్ల రాజేందర్ శర్మ, బద్దం నారాయణ రెడ్డి, కటకం చంద్రమౌళి, తెలుగు రాష్ట్రాల ప్రతినిధులతో పాటు వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన ఓసి నేతలు తదితరులు పాల్గొన్నారు.

## వరద కాలువకు నీరు వదలాలని తహసీల్దారుకు బిజెపి నాయకుల వినతి

**సూర్య-కథలాపూర్**



వరద కాలువకు నీరు వదలాలని సోమవారం మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు మల్యాల మారుతి ఆధ్వర్యంలో కిషాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు కోడిపల్లి గోపాల్ రెడ్డి తహసీల్దారు వినోద్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులకు రైతు భరోసా, వానా కాలంలో కొనుగోలు చేసిన మొక్కజొన్న డబ్బులు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరద కాలువలో నీరు విడుదల చేసి రబీరైతులు వేసుకున్న పంటలను కాపాడాలని కోరారు.వేసవి కాలంలో మొక్క జొన్న కేంద్రాలను ఏర్పాటు చేయాలని అన్నారు. రైతులకు పూర్తి స్థాయిలో రెండు లక్షల రుణ మాఫీ చేయాలని అన్నారు. లేని పక్షంలో బారతీయ జనతా కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో రైతుల పక్షాన ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రాచమడుగు వెంకటేశ్వరరావు, మాజీ మండల అధ్యక్షుడు కంటే సత్యనారాయణ, నరెడ్ల రవి, పిడుగు ప్రతాప్ రెడ్డి,కథలాపురం మహేష్, కాసోజీ ప్రతాప్,ఆరే శివ, బొమ్మ మధు,కల్లెడ ప్రసాద్, కంటే రాజం, లింగమూర్తి, సాయిరెడ్డి, అశోక్, కిషోర్, మహేష్, రాంసింగ్, ప్రవీణ్, శేఖర్, సురేష్, అనుదీప్, గణేష్, సురేష్, సాయి తదితరులు ఉన్నారు.

## నిజామాబాద్ ఎంపీని కలిసిన నూతన బీజేపీ కౌన్సిలర్లు

**సూర్య,రాయికల్**

మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన జగిత్యాల్ నియోజకవర్గ జగిత్యాల, రాయికల్ పట్టణ కౌన్సిలర్లు సోమవారం నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్‌ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా.భోగ శ్రావణితో కలిసి హైదరాబాద్‌లో వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా రాయికల్, జగిత్యాల మున్సిపల్ అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని గెలిచిన కౌన్సిలర్లు ఎంపీని కోరారు.ఈ సందర్భంగా ఆయన సానుకూలంగా స్పందించి, మున్సిపల్ల అభివృద్ధికి నిధులు కేటాయిస్తానని,అలాగే గ్రామ,పట్టణ ప్రజలకు కేంద్రం అందించే సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తూ,బీజేపీ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపినట్లు నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు,జగిత్యాల పట్టణ అధ్యక్షులు కొక్కు గంగాధర్, రాయికల్ పట్టణ అధ్యక్షులు కుర్మా మల్లారెడ్డి, రాయికల్, జగిత్యాల కౌన్సిలర్లు కల్లెడ ధర్మపురి,వేముల శ్రీనివాస్,నిమ్మల నాగరాజు,కొక్కు అనిత, సిరిపురం శ్రీలత-శ్రీనివాస్,గట్టి పెల్లి జ్ఞానేశ్వర్, కునారపు మానస-భూమేష్,తోపారపు ప్రశాంతి-సురేష్,పుర్రె శ్రీధర్,వేముల మౌనిక-రాము తదితరులు పాల్గొన్నారు.



## న్యాయ సేవల సమాచారం కోసం ఈ కోర్ట్ యాప్

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



న్యాయ వ్యవస్థలో న్యాయసేవలకు సంబంధించిన సమాచారం కక్షిదారులతో పాటు సాధారణ పౌరులకు అందుబాటులో ఉండేలా కేంద్రప్రభుత్వం ఈ-కోర్టు యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని ఆ యాప్ వివరాలను సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు సీనియర్ న్యాయ వాది హరి అశోక్ కుమార్ ఇలా వివరించారు.గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఈ యాప్ ను డౌన్ లోడ్ చేసుకోవచ్చు. అలాగే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సేవలను సైతం ఈ యాప్ ద్వారా పొందే వీలుంది. కేసుకు సంబంధించిన సి.ఎన్.ఆర్,ఎఫ్.ఐ.ఆర్ సంఖ్యల ఆధారంగా కేసుల వివరాలు తెలుసుకోవచ్చు.కేసుకు సంబంధించిన సాఫ్ట్ కాపీని సైతం డౌన్లోడ్ చేసుకోవచ్చు. న్యాయమూర్తులు విచారించే కేసుల వివరాలకు సంబంధించిన 30రోజుల సమాచారం ఇందులో అందుబాటులో ఉంటుందని, దీంతో పాటు ఈ-పే అప్షన్ ద్వారా చాలాన్లు సైతం చెల్లించే వీలుందని, సమాచారం కోసం హరి అశోక్ కుమార్ వివరించారు.

## ఓటర్ లిస్టులో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

**- కలెక్టర్‌కి ఫిర్యాదు చేసిన కౌన్సిలర్ క్యాదాసు నవీన్**

**సూర్య, జగిత్యాల**



ఓటర్లను నమోదు చేసే అంశంలో ఓటర్ లిస్టులో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జగిత్యాల పట్టణానికి చెందిన నాల్గవ వార్డు కౌన్సిలర్ క్యాదాసు నవీన్ జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశాడు. సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ఓటర్ల నమోదు తప్పుల తడకగా ఉందని, ఇది కొంతమంది వ్యక్తులు ఉద్దేశపూర్వకంగానే చేసి ఓటర్లను అనేక ఇబ్బందులకు గురి చేశారని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇటువంటి చర్యల వల్ల ఓటర్ల హక్కులకు తీవ్రభంగం వాటిల్లుతుందని, వెంటనే బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

## యమధర్మరాజుకు భరణి నక్షత్ర పూజలు

**సూర్య, ధర్మపురి**



ప్రముఖ పుణ్యక్షేత్రం ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో భరణి నక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. భరణి నక్షత్రాన్ని పురస్కరించుకొని మంగళవారం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ దేవాలయమైన శ్రీ యమధర్మరాజు వారికి పురుషసూక్తం, శ్రీ లక్ష్మీ సూక్తం, మన్యు సూక్తంతో అభిషేకం,ఆయుష్యహోమంతో ప్రత్యేక పూజలు, హారతి మంత్రపుష్పం, తదితర కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమములో దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు జక్కు రవీందర్ ధర్మకర్తల మండలి సభ్యులు,వేదపండితులు పాలెపు ప్రవీణ్ కుమార్ శర్మ,సీనియర్ అసిస్టెంట్ అల్వాల శ్రీనివాస్ అర్చకులు నేరెళ్ల వంశీకృష్ణ, వొద్దిపర్తి కళ్యాణ్ కుమార్,అభిషేకం పురోహితులు బొజ్జ సంతోష్ కుమార్, రాజగోపాల్ సిబ్బంది అర్చకులు, అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రైతులకు అధికంగా ఎరువులు వాడకం వల్ల వచ్చే సమస్యలపై అవగాహన

**సూర్య, ఎండపల్లి**



ఎండపల్లి మండలంలోని గుల్లకోట గ్రామ రైతు వేదికలో సోమవారం అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏటిఎంఏ, ఏజెన్సీ ఆధ్వర్యంలో రైతులకు అధికంగా ఎరువులు వాడకం వల్ల వచ్చే సమస్యల గూర్చి, నానో యూరియా ఉపయోగాలు ప్రకృతి వ్యవసాయం గూర్చి రైతులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎండపల్లి వ్యవసాయ అధికారి మహేష్, వెల్గటూర్ వ్యవసాయాధికారి సాయి కిరణ్, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
పెద్దపల్లి
మంగళవారం 24 ఫిబ్రవరి 2026 

## పోలీసు క్రీడాకారులకు ఘన సత్కారం

### - ప్రతిభకు సంపూర్ణ ప్రోత్సాహం - రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**సూర్య-గోదావరిఖని**



పోలీసు శాఖలో ప్రతిభ గల క్రీడాకారులను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన పోలీస్ క్రీడాకారులను సోమవారం కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా అభినందించారు. ఇటీవల 4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026 సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ గ్రౌండ్స్‌లో హోరాహోరీగా జరిగింది. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారుల కు వ్యక్తిగతంగా సీపీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడల్లో విజయం సాధించడం క్రమశిక్షణ, సమన్వయం, నిరంతర సాధన వల్లే సాధ్యమని అన్నారు. క్రీడలకు సమయం కేటాయించే పోలీస్ అధికారులకు పూర్తి స్థాయి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి విజయాలు సాధించి శాఖకు మరింత కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయని, విధి నిర్వహణలో క్రీడాస్ఫూర్తి ఎంతో అవసరమని తెలిపారు. ఈ క్రీడా మహోత్సవంలో కాళేశ్వరం జోన్ నుండి 150 మంది పాల్గొనగా, 30 మంది క్రీడాకారు లు మొత్తం 23 పతకాలు సాధించారు. అందులో 7 బంగారు, 8 వెండి, 8 కాంస్య పతకాలు ఉన్నాయి. రామగుం డం పోలీస్ కమిషనరేట్‌కు చెందిన 15 మంది, ములుగు జిల్లా నుండి 5 మంది, కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా నుండి 6 మంది, జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుండి 4 మంది క్రీడాకారులు పతకాలు సాధించారు. ఇంకా ఈ కార్యక్రమంలో రామగుండం పోలీస్ కమిషనరేట్ అదనపు డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఏఓ శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ కృష్ణ, ఆర్ఐలు శేఖర్, పెద్దన్న, సీసీ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలి

### - మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి - సిఐటియు జిల్లా అధ్యక్షులు ముత్యంరావు డిమాండ్

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**



పెద్దపల్లి జిల్లా గ్రామపంచాయతీ ఉద్యోగుల, కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణు కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎరవెల్లి ముత్యం రావు మాట్లాడుతూ, జిల్లాలో సుమారు 1500 మంది పంచాయతీ కార్మికులు గ్రామాల పారిశుద్ధ్యానికి సేవలందిస్తున్నప్పటికీ వారికి ఉద్యోగ భద్రత, సరైన వేతనాలు, సంక్షేమ సదుపాయాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా గ్రీన్ ఛానల్ ద్వారా నేరుగా కార్మికుల ఖాతాల్లో వేతనాలు జమ చేయాలని, రెండు నెలల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 2018లో జారీ చేసిన జీఓ నెం.51 సవరణ చేసి, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, పాత కేటగిరీలను పునరుద్ధరించాలని కోరారు. ప్రమాదాల్లో మరణించిన కార్మికుల కుటుంబాలకు తగిన నష్టపరిహారం, ప్రతి కార్మికుడికి రూ.10 లక్షల బీమా సదుపాయం కల్పించాలని అన్నారు. కారోబార్, బిల్ కలెక్టర్లకు ప్రత్యేక హోదా ఇవ్వాలని, ఆన్‌లైన్‌లో నమోదు కాని కార్మికుల పేర్లను నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సీపెల్లి రవీందర్, ఎండి ఖాజా ,జిల్లా ఉపాధ్యక్షులు ఇరుగురాల లచ్చయ్య,జంగపల్లి నరేష్,అశోక్,పైడిపల్లి నాగయ్య,సహాయ కార్యదర్శులు తిట్ల శ్రీనివాస్, వేల్పుల భాస్కర్,రెడ్డిమల్ల నాగేశ్వర్, శాతరాజుల గంగాధర్,జిల్లా కమిటీ సభ్యులు వైద్య సంపత్, పంగ భాస్కర్, అప్సర్, ఆసంపల్లి చంద్రయ్య, లక్ష్మణ్, రాజేశం,శారద,స్వప్న,సదానందం, కనుకయ్య, ముస్తఫా,కార్మికులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అధికారులను కలిసిన పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**



పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నూగిళ్ల మల్లయ్య సోమవారం పట్టణ పోలీస్ అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. చైర్మన్‌గా ఎన్నికైన తర్వాత మొదటిసారి ఏసీపీ కార్యాలయానికి వచ్చిన ఆయనను ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై లక్ష్మణ్ రావు సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు చైర్మన్ మల్లయ్యను శాలువాలు కప్పి, పూల బొకేలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఏసీపీ గజ్జి కృష్ణ మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖకు మున్సిపాలిటీ తరపున పూర్తి సహకారం అందించాలని కోరారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, పారదర్శకమైన పాలన అందించాలని ఆయన ఆకాంక్షించారు. మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య స్పందిస్తూ పెద్దపల్లి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడమే తన లక్ష్యమని తెలిపారు. పట్టణాభివృద్ధిలో పోలీస్ శాఖ నుంచి ఎప్పటికప్పుడు తగిన సూచనలు, సహకారం అందించాలని ఏసీపీని కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి పెద్దపల్లిని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ఆయన పేర్కొన్నారు.

## నా సొంత స్థలంలో వేసిన సిసి రోడ్డు తొలగించాలి

### - జిల్లా కలెక్టర్‌కు బాధితుడి ఫిర్యాదు

**సూర్య జూలపల్లి**



మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డు సమాచారం లేకుండా అక్రమంగా తన సొంత స్థలంలో నుండి కేవలం ఒక ఇంటి కోసం రోడ్డు వేసిన కాంట్రాక్టరుపై చర్యలు తీసుకొని రోడ్డున తొలగించాలని ఇస్కిల్ల నవీన్ కుమార్ ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు ఫిర్యాదు చేశారు. గ్రామపంచాయతీలో ఎలాంటి తీర్మానం తీసుకోకుండా పంచాయతీ అనుమతులు లేకుండా కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా నిర్మించిన సిసి రోడ్డును తొలగించి నా స్థలాన్ని ఖాళీ చేయించి న్యాయం చేయాలని, తల్లితండ్రులు మరణించడంతో పొట్టకూటికోసం కరీంనగర్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్న నేను గతవారం రోజుల క్రితం ఇంటికి రాగా నా సొంత స్థలంలో సీసీ రోడ్డు వేసి ఉండడం చూసి అవాక్కై గ్రామపంచాయతీ, పోలీస్ స్టేషన్, ఎంపీడీవో, పంచాయతీ రాజ్ ఏఈ తదితరులకు ఫిర్యాదు చేశానని ఎవరు పట్టించుకోకపోవడంతో ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు. లక్షల నిధులు కేవలం ఒకే ఒక ఇంటి యజమానికి తన సొంత స్థలం నుండి అక్రమంగా సీసీ రోడ్డు నిర్మించడంలో కాంట్రాక్టర్‌కు అత్యుత్సాహం ఎందుకని ప్రశ్నించారు. కాగా సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నుండి ఏ నిధులు కేటాయించారో, ఎన్ని నిధులు కేటాయించారో కూడా ఎక్కడినుండి ఎక్కడికి నిర్మించారో గ్రామపంచాయతీలో తీర్మానం లేదని వెంటనే సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకొని న్యాయం చేయాలని బాధితుడు కోరారు.

## ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

### - కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**



సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణిలో వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణుతో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. జిల్లాలోనీ పలు ప్రాంతాల నుండి సమస్యల పరిష్కారానికై ప్రజావాణిలో పలువురు అర్జీలను సమర్పించగా వాటిని పరిశీలించి పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీకి భౌతిక కాయం అప్పగింత

**సూర్య - పెద్దపల్లి రూరల్**



మండలంలోని గుర్రంపల్లి గ్రామానికి చెందిన వడ్నాల రామచంద్రం (68) పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందారు. రామచంద్రంకు కుటుంబ సభ్యులు ఎవరు లేకపోవడంతో గ్రామ సర్పంచ్ తొగరి సంపత్, మాజీ సర్పంచ్ జక్కుల రాజేశం, సామాజిక కార్యకర్త కోమటిపల్లి రాజేందర్ ఆధ్వర్యంలో రామగుండం మెడికల్ కాలేజీకి మృతదేహాన్ని అందించారు.

## ఘనంగా గాయత్రి విద్యానికేతన్ హై స్కూల్ 'ఆనందోత్సవ్-2026'

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**




పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్ హై స్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో ఆనందోత్సవ్-2026 వేడుకలు వైభవంగా నిర్వహించారు. గాయత్రి విద్యాసంస్థల అధినేత అల్లంకి శ్రీనివాస్ జ్యోతిప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ప్రేక్షకులు హాజరైన ఈ వేడుకల్లో విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అకాడమిక్, సహపాఠ్య కార్యక్రమాల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చైర్మన్ శ్రీనివాస్ విద్యాసంస్థ 19వ సంవత్సరంలోకి అడుగుపెడుతోందని, అందరి సహకారంతోనే ఈ స్థాయికి చేరిందని తెలిపారు. కరెస్పాండెంట్ రజనీ దేవి విద్యార్థులు సానుకూల దృక్పథంతో కృషి చేస్తే విజయాలు సాధ్యమని విద్యార్థులకు వివరించారు. స్వాగత గీతం, కాళీమాత నృత్యం, రైతుల సమస్యలపై ప్రదర్శన, "ఆపరేషన్ సింధూర్" నృత్యరూపకం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులు నృత్యాల్లో పాల్గొనడం విశేషంగా ఆకట్టుకుంది. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాల ముంగిట పొంచి ఉన్న ప్రమాదం



పెద్దపల్లి పట్టణంలోని శాంతినగర్‌లో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (MPPS) ఆవరణలో ఒక చెట్టు ప్రమాదకర స్థితిలో ఉంది. పాఠశాల లోపలికి వెళ్లే ప్రధాన ద్వారానికి ఆనుకుని ఉన్న ఈ చెట్టు పూర్తిగా ఒక వైపు నకు వంగిపోయి ఉండగా సగం కూలి పోయిన కూడా సపోర్టుగా ఉంది. ఏ క్షణంలోనైనా కూలిపో యేలా కనిపిస్తోంది. ఈ చెట్టు కింద నుంచే పాఠశాల లోపలికి వెళ్లా ల్సిన పరిస్థితి ఉండడంతో గాలివాన వచ్చి నా లేదా చిన్నపాటి గాలి వీచినా చెట్టు కూలి పిల్లలపై పడే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి, ఈ ప్రమాదకర మైన చెట్టును తొలగించాలని లేదా సురక్షితంగా కొమ్మలు నరికివేయా లని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

**సూర్య ఫోటోగ్రాఫర్ పెద్దపల్లి**

# పేదింటి ఆడబిడ్డలకు వరం కళ్యాణ లక్ష్మి

### - గతంలో కాంగ్రెస్ ప్రవేశపెట్టిన పథకమే కళ్యాణ లక్ష్మి
### - ప్రజలు గత పాలకులను విమర్శిస్తున్నారు - ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

**సూర్య - ఎలిగేడు**

ఎలిగేడు మండలం, శివపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు 28 మంది లబ్ధిదారులకు రూ. 28,03,248/- విలువైన కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఎలిగేడు మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులు ఈ సహాయం పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 2013-14 సంవత్సరంలో తాను శాసనసభ్యుడిగా ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగించిందే తప్ప, అది వారి ప్రవేశపెట్టిన పథకం కాదని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో జరిగిన ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపారని, ఎలిగేడు




మండలంలోని 12 సర్పంచ్ స్థానాల్లో 11 స్థానాలను కాంగ్రెస్ అభ్యర్థులు గెలుచుకున్నారని తెలిపారు. అలాగే పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపాలిటీలలో కూడా కాంగ్రెస్ అభ్యర్థులు విజయాలు సాధించారని చెప్పారు. సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ముందంజలో ఉందని, ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు సన్నవడ్లకు బోనస్, నిరుపేదలకు వైద్యం కోసం ఎల్ఓసీలు, ఇందిరా ఇండ్లు, రేషన్ కార్డులు వంటి పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని, రైతులకు ప్రాధాన్యత ఇస్తూ సస్యశ్యామలం చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎలిగేడు అధికారులు, పలు గ్రామాల సర్పంచ్‌లు కప్పల ప్రవీణ్, ఏలేటి వెంకట్ రెడ్డి, మద్దెల రమాదేవి-సంపత్, పల్లెర్ల వెంకటేష్ గౌడ్, ఉపసర్పంచ్‌లు, మండల పార్టీ అధ్యక్షుడు సామ రాజేశ్వర్ రెడ్డి, సుల్తాన్ పూర్ మాజీ సర్పంచ్ అరసనపల్లి వెంకటేశ్వర రావు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు లబ్ధిదారులు పాల్గొన్నారు.




## పసికందు ప్రాణం తీసిన వారిని వెంటనే శిక్షించాలి

**సూర్య, హుజురాబాద్**

నాగర్ కర్నూల్ మండలం కుమ్మెర మల్లన్న జాతరలో రజక కుటుంబంపై అమానుషంగా దాడి చేసి, రెండు నెలల పసికందు మృతికి కారణమైన అగ్రకుల అహంకారులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని రజక యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నిమ్మటూరి సాయి కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద రజక మహిళలతో కలిసి ఆయన భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సాయికృష్ణ మాట్లాడుతూ... మల్లన్న దర్శనం కోసం వెళ్లిన చాకలి చంద్రకళ కుటుంబాన్ని అడ్డుకోవడం సభ్య సమాజం తలదించుకోవాల్సిన విషయమని మండిపడ్డారు. కులం పేరుతో దూషిస్తూ, ఆలయంలోకి ప్రవేశం లేకుండా అడ్డుకోవడమే కాకుండా, ఎదురు తిరిగినందుకు కుటుంబ సభ్యులపై విచక్షణారహితంగా దాడి చేయడం దుర్మార్గమని అన్నారు. ఈ దాడిలోనే రెండు నెలల పసికందు మరణించడం అత్యంత విషాదకరమని, దీనికి బాధ్యులైన వారిపై హత్య కేసు నమోదు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. నిందితులకు కొమ్ముకాసిన పోలీసు అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొలిపాక సారయ్య, నాయకులు నల్ల బాలరాజ్, కొలిపాక శ్రీనివాస్, కొండపాక పవన్, నల్ల సుమన్, సుంకరి మొగిలి, కొండపాక లక్ష్మి, నిమ్మటూరి రమ, వసంత, భూలక్ష్మి, స్వరూప, కొలిపాక రంగయ్య, ప్రజాసంఘాల నాయకులు వేల్పుల ప్రభాకర్, తులసి లక్ష్మణమూర్తి, చిలకమర్రి శ్రీనివాస్, సాదుల రవీందర్, ఇప్పకాయల సాగర్ తో పాటు తదితరులు పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు.



## లక్ష్మక్కపల్లి సమస్యలను వెంటనే పరిష్కరించండి

### - అడిషనల్ కలెక్టర్ ఆదేశం

**సూర్య, వీణవంక**

వీణవంక మండలంలోని లక్ష్మక్కపల్లి గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ పాల్గొని, గ్రామ సమస్యల పై వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామంలోని పెండింగ్ పనులు, ఇరిగేషన్ సమస్యలు, ఇతర పౌర సౌకర్యాల గురించి శ్రీనివాస్ యాదవ్ అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్.. అక్కడికక్కడే మండల పరిషత్ అభివృద్ధి అధికారి, ఎస్సీ ఇరిగేషన్, ఇతర సంబంధిత శాఖల అధికారులతో ఫోన్ లో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



## 11వ ప్యాకేజ్ కాలువ పనులను పూర్తి చేయాలి

### - సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు

**సూర్య, తంగళ్లపల్లి**

11వ కాళేశ్వరం ప్రాజెక్టు పనులను పూర్తి చేసి మండలంలోని రైతులను ఆదుకోవాలని తంగళ్ళపల్లి సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు పూర్మాని రాజశేఖర్ రెడ్డి అన్నారు. 11వ కాలువ పెండింగ్ పనులను పూర్తి చేయాలని సిరిసిల్లలోని కలెక్టరేట్లో జరిగిన ప్రజావాణిలో కలెక్టర్ గరిమ అగ్రవాల్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలువ పెండింగ్ పనులు పూర్తి కావడం వల్ల రైతులకు నీరు అందుతుందని పేర్కొన్నారు. వెంటనే కాలువ పెండింగ్ పనులను పూర్తి చేసి రైతులకు నీరు వచ్చేలా చూడాలని స్పష్టం చేశారు.



## రెవెన్యూ ఆఫీసులో పోస్టులు భర్తీ చేయాలి

### - సిపిఐ నాయకులు ప్రజావాణిలో వినతి పత్రం

**సూర్య గన్నేరువరం**

గన్నేరు వరం మండలంలోని రెవెన్యూ ఆఫీసులో ఖాళీగా ఉన్నటువంటి పోస్టులను భర్తీ చేయాలని భారత కమ్యూనిస్ట్ పార్టీ మండల కార్యదర్శి చోక్కల శ్రీశైలం, జిల్లా కౌన్సిల్ సభ్యులు కాంతల అంజిరెడ్డి ప్రజావాణిలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గన్నేరువరంలో భూ సమస్యలు చాలావరకు పెండింగ్లో ఉన్నాయి భూభారతిలో వచ్చినటువంటి దరఖాస్తులు వెంటనే పరిష్కారం చూపాలని సిబ్బంది నియమించి వచ్చిన సమస్యను పరిష్కారం కొరకై చొరవ చూపాలని అన్నారు. కొన్ని గ్రామాలకి ఇన్చార్జి జిపిలను మాత్రమే నియమించారు మండలంలో ఒక్కరే రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఉన్నారని త ద్వారా ఈ చివరన ఉంటే ఆ చివరికి చేరుకోలేకపోతున్నారని భూ సమస్యలు ఆలస్యం అవుతున్నాయని అన్నారు.



## ఆశా కార్యకర్తలను అరెస్టు చేసిన పోలీసులు

**సూర్య రామడుగు**

తెలంగాణ గ్రామీణ ఆరోగ్య ఆశ కార్యకర్తలను సుమారు రామడుగు పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు. సిఐటియు యూనియన్ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు హైదరాబాదులో తలపెట్టిన ధర్నా సమావేశానికి పిలుపునిచ్చింది. జీతాలు అందక ఇబ్బంది పడుతున్నామని ధర్నా కార్యక్రమానికి వెళుతున్న తమను అరెస్టు చేయడం అన్యాయమని ఆశా కార్యకర్తల సంఘం మండల అధ్యక్షురాలు ఎండి రబియా బేగం ప్రధాన కార్యదర్శి దొండపాటి సరిత అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యాప్తంగా సుమారు 50 మందిని అరెస్టు చేశారు.



## మహిళా హామీల అమలుకు 25న కలెక్టరేట్ వద్ద ధర్నా

### - తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్

**సూర్య కరీంనగర్**

మహిళలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ తెలిపారు. జిల్లా జాగృతి కార్యాలయంలో జరిగిన మహిళా విభాగం సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలను ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. మహాలక్ష్మి పథకం కింద రూ.2,500, కళ్యాణలక్ష్మి తులం బంగారం, చేయూత పింఛన్ రూ.4,000, విద్యార్థినులకు స్కూటీలు వంటి హామీలు ఇంకా అమలు కాలేదని పేర్కొన్నారు. సమావేశానికి మహిళా విభాగం అధ్యక్షురాలు అక్కం శివరాణి అధ్యక్షత వహించగా, జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



## చెస్ చాంపియన్‌షిప్‌లో అద్వితా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

**సూర్య కరీంనగర్**

అద్వితా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు మరోసారి తమ ప్రతిభను చాటుతూ, జీనియస్ చెస్ అకాడమీ నిర్వహించిన చెస్ చాంపియన్‌షిప్‌లో విశేష ప్రతిభ కనబరిచి పాఠశాలకు కీర్తి తీసుకువచ్చారు. సీనియర్ కేజీ విద్యార్థిని కె. అద్వైత, చిన్న వయస్సులోనే అద్భుతమైన ప్రతిభ, ధైర్యం ప్రదర్శించి "బెస్ట్ యంగెస్ట్ ప్లేయర్" అవార్డును అందుకుంది. 3వ తరగతి విద్యార్థి వి. అద్విత్, తన వ్యూహాత్మక ఆలోచన మరియు స్థిరత్వంతో అండర్-9 బాలుర విభాగంలో 4వ స్థానంను సాధించాడు. పాఠశాల యాజమాన్యం చైర్మన్ కోమరయ్య సౌగాని, డైరెక్టర్ అనుదీప్ సౌగాని అలాగే ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఈ విజేతలను హృదయపూర్వకంగా అభినందించారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసే దిశగా పాఠశాల కృషి కొనసాగుతుందని వారు తెలిపారు. విద్యార్థుల కృషి మరియు తల్లిదండ్రుల సహకారం ఈ విజయానికి బలమైన ఆధారమని ప్రశంసించారు. భవిష్యత్తులో కె. అద్వైత, వి. అద్విత్ మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు మరింత కీర్తి తీసుకురావాలని అద్వితా ఇంటర్నేషనల్ స్కూల్ ఆకాంక్షిస్తోంది.




## విద్యార్థులు ఒత్తిడిని జయిస్తే మంచి ఫలితాలు సాధిస్తారు

**సూర్య కరీంనగర్ టౌన్**

హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కరీంనగర్ 1వ డివిజన్ ఆరేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 23 మంది విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అట్టలు మరియు పెన్నులు డివిజన్ కార్పొరేటర్ బారి జితేందర్ చేతుల మీదుగా అందజేయడం జరిగిందని సంస్థ వ్యవస్థాపకులు ధనపురి సాగర్ తెలిపారు. ఈ సందర్భంగా సాగర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పరీక్షలను పండుగలాగా భావించాలని, భయపడకుండా, ఇతర విద్యార్థులతో పోల్చుకోకుండా, ఒత్తిడిని జయిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. అలాగే ప్రశ్నపత్రంను మూడు నాలుగు సార్లు చదివి అర్థం చేసుకొని సమాధానం రాయడానికి పూనుకోవాలని సూచించారు. రాబోవు వార్షిక పరీక్షలో ఏ విద్యార్థి అయితే 560 పై మార్కులు సాధిస్తారు వారికి సంస్థ పక్షాన 2016 నగదు పారితోషికం అందజేయడం జరుగుతుందని తెలిపారు. కార్పొరేటర్ జితేందర్ మాట్లాడుతూ కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చు అని తెలిపారు. ఈ సందర్భంగా డివిజన్ కార్పొరేటర్ ను శాలువా మెమొంటోతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, సంస్థ సభ్యులు శ్రీధర్ రెడ్డి, మన్ సాయి, హిమ సాయి, సాయి తేజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఉరివేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

**సూర్య పెగడపల్లి**

మండలంలోని సుద్ద పల్లి గ్రామానికి చెందిన ధర్మయ్య అనే వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీస్ తెలిపిన వివరాల ప్రకారం ధర్మయ్య (75) గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నాడు. అయినప్పటికీ తన వ్యాధి నయం కాకపోవడంతో సోమవారం ఇంట్లోనే దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోగా, మృతుని కుమారుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్ పిసి రవీందర్ తెలిపారు.

# సుడా అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షా సమావేశం

**- నాణ్యతతో పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచన**

**- పాల్గొన్న చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, సుడా వైస్ చైర్మన్ ప్రఫుల్ దేశాయ్**

సూర్య కరీంనగర్

సుడా అభివృద్ధి పనులు నగర, పరిసర ప్రాంతాల సుందరీకరణ పనులు తదితర అంశాలపై సుడా వైస్ చైర్మన్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు టెండర్ ప్రక్రియ పూర్తయి పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే త్వరితగతిన పూర్తి చేయాలని నగరంతో పాటు పరిసర గ్రామాల ప్రధాన రహదారులు జంక్షన్లు డివైడర్ల సుందరీకరణకు అధిక ప్రాధాన్యతనిస్తూ పనులకు రూపకల్పన చేయాలని అధికారులను



ఆదేశించారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన వర్టికల్ గార్డెన్లు,జంక్షన్ల సుందరీకరణ మరియు పార్కుల పనులు వెంటనే ప్రారంభించాలని సూచించారు. ఐడిఎస్ఎంటీ లో బ్యాలెన్స్ పనులు వారం రోజులలో పూర్తి చేయాలని ఫుడ్ కోర్టు పనుల శంకుస్థాపనకు అన్ని ఏర్పాట్లు చేయాలని డివైడర్ల మధ్యన పాట్స్ ఏర్పాటు చేసి వాటిలో రకరకాల పూల మొక్కలతో సుందరీకరణ చేయాలని నిర్ణయించారు.ఎన్టిఆర్ విగ్రహం కూడలితో పాటు నూతనంగా జంక్షన్ల సుందరీకరణకు రూపకల్పన చేయాలని అధికారులకు సూచించారు.పనులు నడుస్తున్న రాజీవ్ చౌక్, యూనివర్సిటీ ముందు జ్యోతిబా పూలే జంక్షన్ వెంటనే పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని సూచించారు.ఈ సమావేశంలో ఎస్ఈ రాజ్ కుమార్,ఈఈ శివానంద్,డిఈ ఏ.రాజేంద్ర ప్రసాద్,ఏఈలు పి.సతీష్,టి.సతీష్, వర్క్ ఇన్స్పెక్టర్ అజ్మల్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థిని విద్యార్థులకు జిల్లాస్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహణ

**- విద్యార్థులందరు భావి శాస్త్ర వేత్తలుగా ఎదగాలి - జిల్లా అడిషనల్ కలెక్టర్ పిలుపు**

సూర్య కరీంనగర్

ఫిబ్రవరి 28 జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థిని విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికి తీసే సదుద్దేశంతో, సైంటిఫిక్ టెంపర్ పెంచే సదుద్దేశ్యం తో ఫోరమ్ ఆఫ్ ఫిజికల్ సైన్స్ కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షులు అమిరిశెట్టి దామోదర్, ప్రధాన కార్యదర్శి ఎ.రాంకిరణ్ మరియుకార్యవర్గం ఆధ్వర్యంలో 16 మండలాల లోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మండల టాపర్స్ అయిన విద్యార్థిని విద్యార్థులకు ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ డిస్ట్రిక్ట్ సైన్స్ మ్యూజియం నందు నిర్వహించడం జరిగింది .ముఖ్య అతిథులుగా విచ్చేసిన కరీంనగర్ డిస్ట్రిక్ట్ అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్), జిల్లా విద్యా శాఖ అధికారి అశ్విని తానాజీ వాకడె మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులందరు మంచి క్రమశిక్షణతో, మంచి అలవాట్లతో తరగతి గదిలో చదువుకొన్న అంశాలను నిజ జీవితంతో అనుసంధానం చేసుకోవాలని



శాస్త్రీయ దృక్పతాన్ని పెంపొందించుకోవాలని, శాస్త్రవేత్త ల కృషిని స్ఫూర్తిగా తీస్కొని ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ నందు మంచి పట్టు సాధించి భావి శాస్త్ర వేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులతో,ఉపాధ్యాయులతో భౌతిక, రసాయన, జీవ శాస్త్రాల కి సంభందించి అనేక అంశాలను అడిగి సంతృప్తి వ్యక్తం చేసారు. జిల్లా సైన్స్ అధికారి చాడ జయపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు అందరూ డిస్ట్రిక్ట్ సైన్స్ మ్యూజియం సందర్శించి విజ్ఞానాన్ని పెంపొందించుకొని ఉన్నత పౌరులుగా ఎదగాలని,సైన్స్ పట్ల ఆసక్తిని పెంపోందిచుకోవాలని ఆకాంక్షిస్తూ ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ కు సంభందించిన టాలెంట్ టెస్ట్ పేపర్ సీల్డ్ కవర్ ను ఆవిష్కరించారు. 16 మండలాల నుండి ఎంపిక కాబడిన మొదటి, రెండవ స్థానాలలో నిలిచిన విద్యార్థులకు మెమెంటోల ప్రధానం చేసారు. కరీంనగర్ నుండి ప్రథమ స్థానం కనపర్తి సుశాంత్ (ZPHS జంగపల్లి), ద్వితీయ స్థానం భూంపల్లి కీర్తి (ZPHS JANGAPALLI),మూడవ స్థానం కోమటిరెడ్డి ఆదిత్య (TGMS ఎలగందల్)లకి మెమెంటో ప్రధానం చేసారు. తెలంగాణ రాష్ట్ర స్థాయి నందు జరిగే టాలెంట్ టెస్ట్‌లో పాల్గొనాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమంలో ప్లానింగ్ కోఆర్డినేటర్ మిలకూరి శ్రీనివాస్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని వసుంధర ఫోరమ్ అఫ్ ఫిజికల్ సైన్స్ భాధ్యులు నాగుల భుజన్ చందర్, నలుమాచు చంద్ర శేఖర్,కామిరెడ్డి రామేశ్వర్ రెడ్డి గైడ్ టీచర్స్ గోరంటల ఆనందం,మునీరొద్దీన్, 32 పాఠశాలల నుండి సంభంధిత గైడ్ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులపై అంబేద్కర్ చౌరస్తాలో బిజెపి నిరసన

సూర్య, హుజురాబాద్



ప్రశ్నించిన వారిని అక్రమ అరెస్టు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ కక్షసాధింపు చర్య మానుకోవాలని బిజెపి పట్టణ అధ్యక్షులు తూర్పాటి రాజు విమర్శించారు. సోమవారం బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణా రెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్ర రావు అక్రమ అరెస్టును నిరసిస్తూ సోమవారం హుజురాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో బిజెపి నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకవైపు బిజెపి ఎమ్మెల్యేలపై దాడులు, మరోవైపు హిందువులపై దారుణమైన అకృత్యాలు జరుగుతున్న... ఈ అరాచకాలను తీవ్రంగా ఖండిస్తున్న భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావుని, బిజెపి ఎమ్మెల్యేలను, ఎంపిలను, ఎమ్మెల్సీలను అక్రమంగా అరెస్టు చేయడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు తూర్పాటి రాజు, బిజెపి సీనియర్ నాయకులు కొలిపాక శ్రీనివాస్, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు తూముల శ్రీనివాస్, నరాల రాజశేఖర్, యాంసాని శశిధర్, ఓడ్నాల విజయ్, బొరగాల సారయ్య, గంట సంపత్, డోరి ఐలయ్య, కొడిమ్యాల పవన్ కుమార్, శ్రీధర్, కుత్తాడి కుమారస్వామి, మోటపోతుల రాకేష్, దున్నపోతుల అశోక్, రాజేష్ ఖన్నా, క్యాస వెంకటేష్, నీలం రవీందర్, రామచంద్రం, బోడిగే సుదర్శన్, తూర్పాటి రాజశేఖర్, పర్థం విజయ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ప్రత్యేక సేవా శిబిరం

**- మక్తపల్లి అభివృద్ధికి వాలంటీర్ల నివేదిక**

సూర్య తిమ్మాపూర్

తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలోని వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మక్తపల్లి గ్రామంలో గత ఏడు రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరం ఘనంగా ముగించారు.ఈ ఏడు రోజుల పాటు వాలంటీర్లు గ్రామంలో వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు.శిబిరం చివరి రోజున, గ్రామంలో కొత్తగా



నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ కార్యాలయ పరిసరాలను వాలంటీర్లు శుభ్రం చేశారు. అనంతరం అక్కడ మొక్కలు నాటి 'హరితహారం' నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని చాటిచెప్పారు.శిబిరం నిర్వహించిన ఏడు రోజుల్లో వాలంటీర్లు గ్రామంలోని ప్రతి వీధిని సందర్శించి, స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. తాగు నీరు, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి ప్రధాన సమస్యలను గుర్తించి, వాటిపై ఒక సమగ్ర నివేదికను రూపొందించారు. ఈ నివేదికను గ్రామ సర్పంచ్ మరియు పంచాయతీ కార్యదర్శికి అందజేస్తూ, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.వాలంటీర్ల సేవలను గ్రామస్తులు మరియు కళాశాల యాజమాన్యం అభినందించారు. దేశభక్తిని చాటుతూ, జాతీయ గీతాలాపనతో ఈ ఏడు రోజుల ప్రత్యేక శిబిరం అధికారికంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గాండ్ల శ్రీనివాస్, ఉప సర్పంచ్ పెంట చంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి పి. వంశీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆర్. సాయినాథ్, జాతీయ ఉత్తమ అవార్డు గ్రహీత కొండ రవియాదవ్ మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా యూనివర్సిటీకి ఎంపిక

సూర్య కరీంనగర్



మిర్యాలగూడలో జరిగిన మహాత్మా గాంధీ యూనివర్సిటీ సెలెక్షన్ లో 80–85 కేజీ కేటగిరిలో ప్రణయ్ కుమార్ శ్రీకృష్ణ ఫిజికల్ ఎద్యుకేషన్ శ్రీనాధపురం అనముల కాలేజ్ తరపున పాల్గొని అత్యంత ప్రతిభను ప్రదర్శించి ఆల్ ఇండియా యూనివర్సిటీకి ఎంపిక కావడం జరిగింది మార్చ్ 2 తారీకు నుంచి పంజాబ్లో జరిగే ఆల్ ఇండియా యూనివర్సిటీకి ఎంపికైనారు. వీరిని కరీంనగర్ డివైస్ ఓ శ్రీనివాస్ గౌడ్ , టీజీవో డిస్టిక్ ప్రెసిడెంట్ మడిపల్లి కాళీ చరణ్,ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి సత్యనారాయణ, కార్యదర్శులు కొత్తకొండ సంపత్ కుమార్, బాక్సింగ్ బాధ్యులు జి మురళి, గోల్కొండ శ్రీరామ్, పృథ్వీరాజ్ అభినందించినారు.

## అగ్రకుల రెడ్డి నాయకులను కఠినంగా శిక్షించాలి

**- బీసీ సంక్షేమ మరియు అనుబంధ సంఘాల డిమాండ్**

సూర్య కరీంనగర్



నాగర్ కర్నూల్‌లోని కుమ్మర మల్లన్న జాతరకు వెళితే మీరు గుడి లోపటికి రావద్దు అంటూ రజక కులానికి చెందిన భార్యాభర్తలను అగ్రకుల రెడ్డి సామాజిక చెందిన నాయకులు విచక్షణ రహితంగా దాడి చేయడమే కాకుండా రెండు నెలల పసికందును కాళ్లతో తొక్కి చంపేశారు. ఈ మరణానికి కారణమైన అగ్రకుల రెడ్డి సామాజిక చెందిన వారిని కఠినంగా శిక్షించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నారోజు రాకేష్ చారి, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు మాదాసు సంజీవ్, జిల్లా కార్యదర్శి వాయిల రాజ్ కుమార్‌తో కలసి కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంకి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. దానికి పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం స్పందిస్తూ తప్పకుండా న్యాయం జరిగేలా మా వంతుగా డీజీపీకి మీ యొక్క వినతి పత్రం పంపించి నిందితులకు కఠిన శిక్ష పడేలా చేస్తామని హామీ ఇచ్చారు.

## ఆర్టీసీ అధికారికి సన్మానం

సూర్య కరీంనగర్



TGSRT SCST ఉద్యోగుల సంక్షేమ సంఘం ఏవో రవికుమార్, పీఓ సంపత్ కుమార్‌లు కరీంనగర్లో పదవి బాధ్యతలు స్వీకరించిన శుభ సందర్భంగా వారికి ఘనంగా సత్కరించినారు. రీజనల్ కార్యదర్శి దొంత రాజయ్య రీజనల్ నాయకురాలు కమల, ఎస్టిఐ మాధవి, టిఐ 3 రీజనల్ నాయకులు సంపతి, ఎంప్లాయ్ వెల్ఫర్ బోర్డ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో త్రాగునీటి సమస్యలపై ప్రత్యేక చర్యలు

**- మేయర్ కొలగాని శ్రీనివాస్**

సూర్య కరీంనగర్



వేసవి కాలంలో నగర ప్రజలకు త్రాగు నీటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మానేరు డ్యాం సమీపంలోని నగరపాలక సంస్థ నీటి శుద్ధీకరణ కేంద్రాన్ని కమీషనర్ ప్రఫుల్ దేశాయ్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సందర్శించి పంప్ హౌజ్‌లు, ఫిల్టర్ బెడ్‌లు, వాల్వ్ లీకేజీలు, మోటార్ల పనితీరును పరిశీలించారు. సమ్మర్ ఆక్షన్ ప్రణాళికలో భాగంగా రూ.49 లక్షలతో పనులు చేపట్టేందుకు టెండర్ ప్రక్రియ ప్రారంభించామని, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా కూడా నీరు సరఫరా చేస్తామని తెలిపారు. విలీన గ్రామాల సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం నివేదికలు పంపిస్తున్నామని చెప్పారు. కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, మానేరు నీటి మట్టం తగ్గడంతో ప్రత్యామ్నాయంగా రోజువారీ సరఫరా చర్యలు చేపడుతున్నామని, త్వరలోనే బూస్టర్ పంపులు ప్రారంభించి సరఫరాను మెరుగుపరుస్తామని తెలిపారు. ఫిల్టర్ బెడ్‌ల పునరుద్ధరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ప్రజలు నీటిని వృథా చేయకుండా వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భీమన్న భక్తులపై ప్రైవేట్ క్యారీ బ్యాగ్ దోపిడీ

**- ప్రసాద కౌంటర్ వద్ద అధిక ధరలకు విక్రయాలు - ఆలయ అధికారులు, సిబ్బందిపై మామూళ్ల ఆరోపణలు ?**

**- ఆలయ నియమాలకు తూట్లు - ప్రసాదాలకు భక్తులకు తప్పని క్యారీ బ్యాగ్ తిప్పలు**

**సూర్య, వేములవాడ**

వేములవాడ భీమేశ్వరాలయ ప్రసాద కౌంటర్ వద్ద ప్రైవేట్ వ్యక్తులు క్యారీ బ్యాగులు విక్రయిస్తూ, భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్యారీ బ్యాగుల విక్రయాలతో అధికారులు, సిబ్బందిపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. భిక్షాటన చేసే మహిళలు, ఇతర ప్రైవేట్ వ్యక్తులు లడ్డూ కౌంటర్ల వద్దే తిష్టవేసి భక్తులకు క్యారీ బ్యాగులను అధిక ధరలకు విక్రయిస్తున్నారనీ, ఆలయ అధికారులు, సిబ్బంది అడ్డుకోకపోగా, వారికి సహకరిస్తున్నారనీ, తమకు కొంత వాటా ఇస్తే అమ్ముకోమని చెబుతున్నట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. క్యారీ బ్యాగుల పేరుతో భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారని, ప్రసాదాల కొనుగోలు అనంతరం వాటి నిల్వకు క్యారీ బ్యాగులు తప్పని సరి అవసరం కావడంతో, భక్తులకు తిప్పలు తప్పడం లేదు. యాదగిరిగుట్ట తరహాలో దేవస్థానమే ప్రత్యేకంగా క్యారీ బ్యాగుల కౌంటర్‌ను ఏర్పాటు చేయాలనీ, ఆలయ ఫోటోలు, శాశ్వత పూజల వివరాలతో కూడిన బ్యాగులను దేవస్థానమే ముద్రించి విక్రయించాలనీ, దీనివల్ల అక్రమాలకు అడ్డుకట్ట పడటమే కాకుండా ఆలయానికి అదనపు ఆదాయం సమకూరుతుందనీ భక్తులు అభిప్రాయ పడుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు





స్పందించి, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## డెస్క్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలి

**సూర్య కరీంనగర్**

జీవో 252 వెంటనే సవరించి డెస్క్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని కరీంనగర్ డెస్క్ జర్నలిస్ట్ ఫోరమ్ డిమాండ్ చేసింది. కలెక్టరేట్ ఎదుట సోమ వారం ఉమ్మడి జిల్లా డెస్క్ జర్నలిస్టులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, గతంలో జిల్లాల ప్రాతిపదికన ఐదేసి చొప్పున అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చారని, ఈ లెక్కన కరీంనగర్ యూనిట్ పరిధిలో 43 కార్డులు అందాయని అన్నారు. తాజా జీవో ప్రకారం కేవలం నాలుగు కార్డులు మాత్రమే ఇస్తామని ప్రకటించడం దారుణమన్నారు. ప్రభుత్వం పునరాలోచించి అర్హులందరికీ కార్డులు అందేలా చూడాలని కోరారు. అనంతరం గ్రీవెన్స్‌లో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. టీయూడబ్ల్యూజే(143) జిల్లా





అధ్యక్షుడు చెరుకు గోపాలకృష్ణ, నాయకులు సీహెచ్.వేణుగోపాల్ రావు, జేరిపోతుల సంపత్, బోనాల వెంకటేశ్, ఫెడరేషన్ కార్యదర్శి బాపురావు తదితరులు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో డెస్క్ జర్నలిస్టుల అడ్‌హక్ కమిటీ కన్వీనర్ పోలు సంపత్, కోకన్వీనర్లు అల్లాడి శ్రీనివాస్, బాడిసె సంపత్ కుమార్, దాముక రాజశేఖర్, దుబ్బాక శ్రీని వాస్, బొమ్మరవేని బాలకృష్ణ, గంగిళ్ళ జీవన్‌రెడ్డి, గోసికొండ ప్రవీణ్, బోయిని సంపత్, అన్ని పత్రికల డెస్క్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఇంటర్ పరీక్షలను నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**

జిల్లాలో ఇంటర్ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఇంటర్ పరీక్షల నిర్వహణ పై అదనపు కలెక్టర్ లు జె. అరుణ శ్రీ, డి. వేణు లతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు జరిగే ఇంటర్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు . జిల్లాలో జనరల్, వోకేషనల్ కలిపి మొత్తం 10367 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అవుతున్నారని, వీరి కోసం 22 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్ష కేంద్రాలకు వచ్చే ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా చెక్ చేయాలని, పరీక్ష కేంద్రాలలో కొంతమంది ముందస్తుగానే సెల్ ఫోన్లు, స్టడీ మెటీరియల్ పెట్టుకునే అవకాశం ఉంటుందని, పరీక్షల కంటే ముందే పూర్తి స్థాయిలో పరీక్ష కేంద్రాన్ని ఒకసారి చెక్ చేసుకోవాలని కలెక్టర్ చూపించారు. పరీక్ష



కేంద్రాలకు ప్రవేశద్వారం వద్ద ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా చెక్ చేసే వ్యవస్థ ఏర్పాటు చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు 100 మీటర్ల వరకు ఎటువంటి పార్కింగ్ పెట్టవద్దని కలెక్టర్ తెలిపారు. పరీక్షల నిర్వహణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని, పరీక్ష కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు పరీక్ష హాల్స్ లో త్రాగు నీరు అందించాలని, అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల సౌకర్యార్థం రవాణా కోసం పరీక్షకు సకాలంలో హాజరయ్యే విధంగా అనుకూలంగా ఆర్టీసీ బస్సులు పరీక్షా కేంద్రాల రూట్ లలో స్పెషల్ బస్సులు నడపాలని అన్నారు. పరీక్ష కేంద్రంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, పరీక్షా ప్రశ్న పత్రాల లీకేజీ ఎట్టి పరిస్థితుల్లోనూ జరగకుండా చీఫ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాల సమక్షంలో ప్రశ్న పత్రాల కవర్ సీళ్లు ఓపెన్ చేయాలని, ఆ సమయంలో అధికారులు సెల్ ఫోన్ తీసుకు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు, కనీస మందులతో పారా మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో పారిశుధ్య నిర్వహణ స్థానిక సంస్థలు పర్యవేక్షించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు అధికారి కల్పన, పెద్దపల్లి ఆర్డిఓలు గంగయ్య, సురేష్, ఏసీపీ జి. కృష్ణ, కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్, మున్సిపల్ కమిషనర్లు వెంకటేష్ ,రమేష్ సంబంధిత అధికారులు, చీఫ్ సూపరెండెంట్ లు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలి

**- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**- 25 మంది సర్వేయర్లకు లైసెన్స్ పత్రాల పంపిణీ**

**సూర్య రాజన్న సిరిసిల్ల.**



లైసెన్సుడు సర్వేయర్లు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదా యంలో సోమవారం 25 మంది సర్వేయర్లకు లైసెన్స్ పత్రాలు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకొని, పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన జిల్లాకు చెందిన 66 మంది సర్వేయర్లకు లైసెన్సులు గతంలో అందజేసిందని గుర్తు చేశారు. గత ఏడాది జిల్లాకు చెందిన సివిల్ విభాగంలో ఉత్తీర్ణత సాధించిన వారికి 50 రోజుల పాటు శిక్షణ ప్రభుత్వం అందించిందని, వారిలో శిక్షణ పూర్తి చేసుకొని పరీక్షలో పాస్ అయిన 25 మందికి లైసెన్స్ పత్రాలను అందించామని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. లైసెన్స్ పొందిన వారు అందరూ వారికి కేటాయించిన మండలాల్లో అందుబాటులో ఉండాలని, ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీనివాస్, నటరాజ్ సిబ్బంది ఉన్నారు.



## తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో కరీంనగర్ కమిషనరేట్ ఘన విజయం

**- అభినందించిన పోలీస్ కమిషనర్**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

సైబరాబాద్ కమిషనరేట్ వేదికగా నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర నాల్గవ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో కరీంనగర్ కమిషనరేట్ పోలీస్ సిబ్బంది విశేష ప్రతిభ కనబరిచి మొత్తం 35 పతకాలను కైవసం చేసుకున్నారు. ఇందులో 9 స్వర్ణ, 13 రజత, 13 కాంస్య పతకాలు సాధించడం విశేషం. వివిధ క్రీడా విభాగాల్లో పోటీ పడిన అధికారులు, సిబ్బంది తమ నైపుణ్యంతో రాష్ట్ర స్థాయిలో సత్తా చాటారు. ఎసీపీ మాధవి టేబుల్ టెన్నిస్‌లో 2 స్వర్ణాలు, బాడ్మింటన్‌లో రజత, యోగాలో కాంస్య పతకం సాధించగా, పీసీ ఎ. స్వప్న మూడు స్వర్ణాలతో అగ్రస్థానంలో నిలిచారు. ఎల్. శ్రీజ రెండు స్వర్ణాలు, ఒక రజత పతకం గెలుచుకున్నారు. పీసీ శ్రీధర్ స్విమ్మింగ్‌లో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ పతకాలు సాధించి బహుముఖ ప్రతిభ చూపించారు. జె. సాయి దీప్ వాటర్ స్పోర్ట్స్‌లో ఒక స్వర్ణం, ఒక కాంస్యం గెలుచుకున్నారు. ఇతర విభాగాల్లోనూ రెజ్లింగ్, పవర్ లిఫ్టింగ్, కబడ్డీ, యోగా, జూడో, అథ్లెటిక్స్, బాడీ బిల్డింగ్ తదితర క్రీడల్లో పలువురు సిబ్బంది పతకాలు సాధించారు. ఈ సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం విజేతలను అభినందిస్తూ, విధి నిర్వహణలో నిమగ్నమై ఉండి కూడా క్రీడల్లో ప్రతిభ కనబరచడం గర్వకారణమన్నారు. క్రీడలు మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని, విజేతలు జాతీయ స్థాయిలో మరింత మెరుగైన ప్రదర్శన ఇవ్వాలని, ఓటమి చెందిన వారు నిరాశ చెందకుండా కృషి కొనసాగించాలని సూచించారు. ఈ విజయాలు శాఖలోని ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిస్తాయని ఆయన పేర్కొన్నారు.

## మనస్థాపంతో గృహిణి ఆత్మహత్య

**సూర్య, హుజురాబాద్.**

హుజురాబాద్ పట్టణంలోని విద్యానగర్ కు చెందిన వేముల భాగ్యలక్ష్మి (56) అనే గృహిణి కుటుంబానికి ఉన్న అప్పుల బాధతో మనస్థాపానికి గురై ఆదివారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని హుజురాబాద్ టౌన్ సిఐ టీ కరుణాకర్ అన్నారు. ఆయన కథనం ప్రకారం.... మృతిరాలి భర్త వేముల కరుణాకర్ (57), జే10 ఏజెన్సీలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నారని, కుటుంబానికి సొంత ఇల్లు , భూమి లేకపోవడంతో జీవనోపాధి కోసం సుమారు10 లక్షల రూపాయలు తిరుమల ఫైనాన్స్‌లో అప్పు తీసుకుని ప్రతి నెలా ఈఎంఐలు చెల్లిస్తున్నారనీ అన్నారు. కాగా ఇటీవల పని సరిగా దొరకకపోవడంతో కుటుంబం ఆర్థిక ఇబ్బం దులు ఎదుర్కొంటూ వచ్చిందని, అప్పుల భారంతో తీవ్ర మనస్తాపానికి గురైన భాగ్యలక్ష్మి ఇంట్లోనే సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మ హత్య చేసుకుందనీ అన్నారు. మృతురాలి భర్త అయిన వేముల కరుణాకర్ యొక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

# పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి పై వార్డు మెంబర్లకు శిక్షణ

## - ఎంపిడిఓ శైలజరాణి, ఎంపీఓ సమ్మిరెడ్డి

**సూర్య, సెంటినరీ కాలనీ**

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి పై వార్డు మెంబర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని రామగిరి ఎంపిడిఓ బద్రి శైలజరాణి, ఎంపీఓ మోతె సమ్మి రెడ్డి అన్నారు. రామగిరి మండలం రత్నాపూర్ రైతు వేదికలో ఐదు రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం వారు ప్రారంభించారు. పంచాయతీ రాజ్ చట్టం పై వారికి అవగాహన కల్పించారు. గ్రామీణ అభివృద్ధి పై సంక్షిప్తంగా వివరించారు. పంచాయతీ సెక్రటరీలు వేణు మాధవ్(ఆదివారంపేట), రాజేందర్(ఓడేడు),




ప్రసాద్(గుండారం), రామ్మోహన్(నాగారం) లు చట్టాలు, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి పై క్లుప్తంగా వివరించారు. ఆదివారంపేట లో 8 మంది వార్డు మెంబర్లు, బేగంపేటలో 12 మంది, బుధవారంపేట లో 8 మంది, కలవచర్ల లో 12 మంది, లద్నాపూర్ లో 10 మంది, లొంకకేసారం లో 8 మంది, నాగేపల్లి లో 10 మంది, నవాబ్ పేట లో 8 మంది, పన్నూర్ లో 14 మంది, రత్నాపూర్ లో 12 మంది, రాజాపూర్ లో 8 మంది, జల్లారంలో 10 మంది, ముస్త్యాల లో 8 మంది, సుందిళ్ల లో 12 మంది, చందనాపూర్ లో 8 మంది వార్డ్ మెంబర్లతో కలుపుకుని మొత్తం 148 మంది వార్డు మెంబర్లు ఈ శిక్షణ లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పంచాయతీ సెక్రటరీ గంగుల సంతోష్, సీనియర్ అసిస్టెంట్ ఎండి.షరీఫ్ పాల్గొన్నారు. ఈ నెల 27వ తేదీ వరకు శిక్షణ నిర్వహించనున్నారు.

## సకాలంలో అభివృద్ధి పనులను పూర్తి చేయాలి.

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**



ఆర్ అండ్ బి శాఖ ద్వారా జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం ఆర్ డబీ శాఖ పని తీరు పై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్ అండ్ బి శాఖ కింద ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్, నాన్ ప్లాన్ నిధులు, డిజాస్టర్ మేనేజ్మెంట్ క్రింద మంజూరైన నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి, మరమ్మత్తు పనులను నిర్దిష్ట సమయంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమా వేశంలో ఈఈ ఆర్ అండ్ బీ భావ్ సింగ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలకు పలువురి ప్రముఖులకు ఆహ్వానం

**సూర్య వెల్గటూర్**



మండలంలోని కిషన్రావుపేట శ్రీ నాగపెల్లి లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయ బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ పలువురి ప్రముఖులకు ఆలయ కమిటీ చైర్మన్ నైనాల అజయ్ సోమవారం బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈనెల 27నుండి వచ్చే నెల 4వతేది వరకు శ్రీలక్ష్మీ నరసింహుడి బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో పలువురు ప్రముఖులు వెల్గటూర్ మాజీ ఎంపిపి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోనుగోటి శ్రీనివాసరావు,ధర్మారం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పోనుగోటి విజయ రంగారావు ను హైదరాబాద్ లో వారి స్వగృహంలో కలిసి బ్రహ్మోత్సవాలకు రావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో కోటిలింగాల ఆలయ కమిటీ చైర్మన్ పూదరి రమేష్,బీఆర్ ఎస్ పార్టీ నాయకులు కుమ్మరి వెంకటేష్, బోగే ప్రేమసాగర్ పాల్గొన్నారు.

## చిన్నారి మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి

### - రజక సంఘం డిమాండ్

**సూర్య - ఎలిగేడు**

నాగర్కర్నూల్ జిల్లా కుమ్మర జాతరలో రజక కుటుంబంపై జరిగిన దాడిలో రెండేళ్ల చిన్నారి మృతి చెందడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ బాధ్యులను కఠినంగా శిక్షించాలని రజక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఎలిగేడు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ సంఘటనను తీవ్రంగా ఖండించారు. అగ్రకులానికి చెందిన కొందరు వ్యక్తులు మానవత్వం మరిచి దేవాలయంలోకి రానివ్వకుండా కులం పేరుతో దూషిస్తూ రజక కుటుంబంపై దాడి చేసి, రెండేళ్ల చిన్నారిని కాలితో తన్ని హత్య చేయడం అమానుష చర్య అని అన్నారు. ఈ ఘటన రజాకార్ల కాలంనాటి అమానుష పరిస్థితులను గుర్తు చేస్తోందని పేర్కొన్నారు.రాష్ట్రంలో ఎస్సీ, బీసీ, ఎస్టీ వర్గాలపై రోజురోజుకు దాడులు, దౌర్జన్యాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలని కోరారు.కుల వివక్షతకు గురవుతున్న రజకులకు అట్రాసిటీ చట్టం వంటి ప్రత్యేక రక్షణ చట్టం కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు ముంజంపల్లి తిరుపతి, రాజేశం, సాయిలు, రాకేష్, మల్లేశం, ఓదెలు, లచ్చయ్య, రమేష్, సమ్మయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ బి ఎస్ కే సిబ్బందికి సిపిఆర్ పై అవగాహన

### - డి ఎం హెచ్ ఓ డాక్టర్ జి సుజాత

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



జగిత్యాల జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి సుజాత ఆధ్వర్యంలో జిల్లాలోని ఆర్బిఎస్కే వైద్య సిబ్బందికి సిపిఆర్ పై అవగాహన శిబిరం నిర్వహి ంచారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎన్సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాజెందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రథమ చికిత్స పై కార్డయో పలమనరి రిసాసినేషన్ పై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఆర్ పై అవగాహన కలిగి ఉంటే అనుకోని సంఘటనలు ఎదురై ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రథమ చికిత్స మరియు సిపిఆర్ చేయవచ్చునని తెలిపారు. ఆయన వెంట నోడల్ ఆఫీసర్ డాక్టర్ రమ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యధికారులు డాక్టర్ లవకుమార్ ఆర్బిఎస్కే వైద్యులు ఎన్ సి డి కోఆర్డినేటర్లు మురళి ,శ్యామ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## అకస్మాత్తుగా మరణం...

**సూర్య, గొల్లపల్లి**



ట్రాక్టర్ అదుపుతప్పగా ఆకస్మికంగా యువకుడు మరణించినట్లు ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళితే జగిత్యాల జిల్లా లోని లంబాడి పల్లి గ్రామానికి చెందిన లెంకల లక్ష్మణ్ తండ్రి శ్రీనివాస్ వయసు 18 సంవత్సరాలు అనునతడు బీబీ రాజు పల్లి లో తన మేనత్త చేను వద్ద పసుపు కొమ్ములు తీసుకు వద్దామని తన ట్రాక్టర్లో వచ్చి తిరిగి వెళ్తుండగా ప్రమాదవశాత్తు బీబీ రాజ్ పల్లె గ్రామ శివారులో తను నడుపుతున్న ట్రాక్టర్ అదుపుతప్పి ప్రక్కనే ఉన్న పొలంలో పల్టీ కొట్టగా ట్రాక్టర్ యొక్క ఇంజన్ మీద పడి అక్కడికక్కడే చనిపోవడం జరిగింది. తన తల్లి అయిన లెంకల మల్లవ్వ ఖ/శీ శ్రీనివాస్ యొక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి తెలిపారు.

## విహార యాత్రలతో విజ్ఞానం పెరుగుతుంది.

**సూర్య, సెంటినరీ కాలనీ**

విహారయాత్రలతో విజ్ఞానం పెరుగుతుంది అని కమాన్పూర్ మండల కేంద్రంలోని కంఫర్ట్ పాఠశాల కరస్పాండెంట్ అర్నకొండ వినయ్ కుమార్ తెలిపారు. కమాన్ పూర్ మండల కేంద్రంలోని కంఫర్ట్ గ్రామర్ స్కూల్ చిన్నారులు విహారయాత్ర లో భాగంగా శాతవాహనులు పరిపాలించిన నాటి ఎలగందల్ నేటి కరీంనగర్ లోని ఉజ్వల పార్క్, డీర్ పార్క్, కేబుల్ బ్రిడ్జి, గల గల పారే మానేరు జలాశయం నీ సందర్శించడం జరిగింది. పిల్లలు చాలా ఆనందంతో వీక్షించడం జరిగింది. పురాతన కాలం నాటి స్థలాలను చూస్తే విద్యార్థులు మేధాశక్తి పెరుగుతుందని వినయ్ కుమార్ అన్నారు. ఈ విహార యాత్రలో పాఠశాల ప్రిన్సిపాల్ వినయ్ కుమార్, సౌమ్య ఉపాధ్యాయులు రవీందర్, పర్వీన్, వహీదా, మౌనిక, సంధ్య, జ్యోత్స్న లక్ష్మి, శిరీష, విజయలక్ష్మి, రవళి, స్పందన, శహనాజ్, చంద్రలేఖ, శరణ్య, మౌనిక పిల్లలు పాల్గొన్నారు.



## ఆయిల్ పామ్ సాగుతో అధిక దిగుబడులు


**సూర్య మల్లాపూర్**



జాతీయ ఆహార భద్రత మిషన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుండంపల్లి గ్రామంలో మండల వ్యవసాయ శాఖ అధికారి లావణ్య రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేట్ ప్రొఫెసర్ డా. సౌమ్య మాట్లాడుతూ.. మొక్కజొన్నలో అధిక దిగుబడులు సాధించడానికి చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. ఆయిల్ పామ్ ఏరియా మేనేజర్ వనోజ్ రెడ్డి మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ ప్రపంచంలోకెల్లా అత్యధిక నూనే దిగుబడిని ఇస్తోందని సంవత్సరానికి నాలుగు నుంచి ఆరు టన్నుల నూనె దిగుబడి వస్తుందని వంటనూనెల ఉత్పత్తిలో ప్రపంచంలోనే ప్రముఖ పాత్ర సంతరించుకున్నదన్నారు.ఆయిల్ పామ్ పండు యొక్క పీచు భాగం నుండి పామాయిల్ గింజల నుండి కెర్నల్ నూనె తీస్తారన్నారు. ఆయిల్ పామ్ సాగుకి 90 శాతం సబ్సిడీ పైన మొక్కలు, డ్రిప్పు అందుబాటులో ఉన్నాయని ఆసక్తి గల రైతులు సంబంధిత హార్టికల్చర్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ శ్రీలత ను సంప్రది ంచాలని సూచించారు. ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్, రైతు ఫోటో లతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి గజానంద్, వంశి, సర్పంచ్ డప్పుల పద్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడుపుల పుష్పలత, గ్రామపంచాయతీ కార్యదర్శి నారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## స్మశాన వాటికకు స్థలం కేటాయించాలని ప్రజావాణిలో వినతి.

**సూర్య రామడుగు**


Prajavani Acknowledgement Receipt

Name:B. Ravi and others
Mobile No. : 9963725138
Address:Gopalraopeta,Gopalraopeta,Gopalraopeta
Village:GOPALRAOPETA
Mandal:RAMADUGU
Grievance Subject:Requests

Your Grievance is Registered vide Registration no.KA070/E/2026/00024 On23-02-2026Please keep the registration number for all future correspondence. Your Grievance is sent to TAHSILDAR OFFICE RAMADUGU

రామడుగు మండలం గోపాలరావు పేట గ్రామంలో దక్కలి కులస్తులకు స్మశాన వాటిక కోసం ప్రభుత్వ స్థలం కేటాయించాలని సోమవారం జిల్లా కలెక్టర్కు ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. గతంలో గ్రామంలోని సర్వేనెంబర్267/2 లో ఎకరం భూమిని తమ కులస్తులకు ప్రభుత్వ ఇచ్చిందన్నారు. గత 15 ఏళ్ల నుండి స్మశానానికి ఉపయోగించు కుంటున్నామని అన్నారు. కానీ ప్రస్తుతం ఈ భూమిని ప్రభుత్వం మాకే కేటాయించిందని కొందరు రైతులు అడ్డగిస్తున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఇప్పటికైనా ఈ స్థలమును దక్కలి కుటుంబాల స్మశాన వాటికకు ప్రభుత్వం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోటయ్య దక్కనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు బాణాల రవి ఉపాధ్యక్షులు బాణాల తిరుపతి రాజమౌళి సభ్యులు పాల్గొన్నారు.

## ఈడబ్ల్యూఎస్ కోటాలో అగ్రవర్ణ పేదలకు న్యాయం చేయాలి

### - రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎడవెల్లి కొండాల్ రెడ్డి

**సూర్య, హుజురాబాద్**

అగ్రవర్ణ పేదలకు ఈడబ్ల్యూఎస్ కోటాలో రిజర్వేషన్లు కల్పించి న్యాయం చేయాలని బిఆర్ఎస్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఓసి జేఏసి జాతీయ నాయకులు ఎడవెల్లి కొండాల్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఓసి లోని పేదల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం న్యూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మహా ధర్నా జరిగింది. ఈ సందర్భంగా




హాజరైన ఆయన మాట్లాడుతూ... రాజ్యాంగ బద్దంగా ఏర్పడ్డ 10 శాతం ఈడబ్ల్యూఎస్ పై రాజకీయ పబ్బశీ కోసం కొన్ని దుష్ట శక్తులు ఆయా కులాల్లోని ప్రజలను మభ్య పెడుతూ చేస్తున్న అసత్య ప్రచారాలు, పన్నుతున్న కుట్రలను సాగనివ్వబోమని అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంపొందించడంతో పాటు వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాలంటే జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కూలీల కొరత, పెరుగుతున్న వ్యయాలు, అనిశ్చిత వర్షపాతం వంటి సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పొలాల సమతలీకరణ, చెరువుల పునరుద్ధరణ, కాలువల శుభ్రపరిచే పనులు, వర్షపు నీటి సంరక్షణ, మట్టి సంరక్షణ చర్యలు వంటి కార్యక్రమాలను పథకంలో చేర్చాలని సూచించారు. దీంతో గ్రామీణ కూలీలకు సంవత్సరమంతా ఉపాధి లభించడంతో పాటు వ్యవసాయోత్పత్తి కూడా పెరుగుతుందని పేర్కొన్నారు.వ్యవసాయం దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న నేపథ్యంలో రైతుల అవసరాలకు అనుగుణంగా ఉపాధి హామీ పథకంలో మార్పులు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామీణాభివృద్ధి, ఆహార భద్రత, రైతు ఆదాయం పెంపు లక్ష్యాలతో ఈ రెండు రంగాలను అనుసంధానం చేస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందని అన్నారు.

# నాగారం చెరువులోకి గోదావరి జలాలు

## - మెట్ట ప్రాంత రైతుల ఏళ్ల కల సాకారం



**సూర్య కోనరావుపేట**

కోనరావుపేట మండలం నాగారం గ్రామానికి గోదావరి జలాలు చేరాయి. మల్కపేట రిజర్వాయర్ ఐదవ కుడి కాలువ నుండి నాగారం పెద్ద చెరువులోకి నీటిని సోమవారం విడుదల చేశారు. దీంతో మెట్ట ప్రాంత రైతుల ఏళ్లుగా ఎదురుచూస్తున్న సాగునీటి కల సాకారమైంది.చెరువులోకి నీరు చేరుతుండటాన్ని చూసిన రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ జలాలతో వానాధార పంటలపై ఆధారపడే పరిస్థితి మారిందన్నారు. గ్రామ పరిధిలోని విస్తీర్ణ భూములు సాగులోకి రానున్నాయి. నీటి విడుదలకు కృషి చేసిన సీఎం రేవంత్ రెడ్డికి, ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు,రైతులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. రిజర్వాయర్ నుంచి చెరువులోకి నీటిని తీసుకురావడానికి కృషి చేసిన సర్పంచ్ నాగభూషణం ను రైతులు అభినందించారు.ఈ సందర్భంగా గ్రామానికి చేరిన గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు సర్పంచ్,పాలకవర్గం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## దేశాయి బ్రదర్స్ బీడీ సెంటర్ ను తరలించొద్దు

### - కడారి రాములు

**సూర్య సిరిసిల్ల టౌన్**




ఏఐటిసి అనుబంధ కార్మిక సంఘం తెలంగాణ బీడీ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు సోమవారం దేశాయి బీడీ కంపెనీ మేనేజర్ కు వినతిపత్రం అందించారు.తెలంగాణ బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కడారి రాములు,రాష్ట్ర ఉపాధ్యక్షులు కేవీ అనసూర్య మాట్లాడుతూ ఎల్లారెడ్డిపేటలోని దేశాయి బ్రదర్స్ బీడీ సెంటర్ ను తరలింపు ఆలోచన నిలుపుదల చేయాలని,ఇట్టి సెంటర్‌ను గంభీరావుపేటలో విలీనం చేయవద్దని కోరారు. ఎల్లారెడ్డిపేట బీడీ కంపెనీలో 30 మంది టేకేదారులు,ఏడుగురు ప్యాకర్లు,నలుగురు శేఖర్లు,గుమస్తాలు,బట్టి వాళ్ళు ఉన్నారని వీరంతా ఉపాధి కోల్పోతారని అన్నారు.దేసై కంపెనీ తరలింపు ఆలోచన మానుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణా రాష్ట్ర బీడీ కార్మిక సంఘశీ జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్జ వేణు,జిల్లా నాయకులు సుంకణపెల్లి శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

### - జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**సూర్య జగిత్యాల ప్రతినిధి**




ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి 36 ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ బి.ఎస్. లత, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పెల్లి ఆర్డీవోలు మధు సూదన్, జీవాకర్ రెడ్డి, శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులకు శ్రీకారం

### - పల్లిమక్తలో సర్పంచ్ అనూష అనిల్ ప్రారంభం

**సూర్య కోనరావుపేట**

కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామంలో ఉపాధి హామీ పనులను సర్పంచ్ జిన్న అనూష అనిల్ కుమార్ సోమవారం ప్రారంభించారు. పాలకవర్గ సభ్యులతో కలిసి పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా సర్పంచ్ అనూష మాట్లాడుతూ..ఉపాధి హామీ పథకం గ్రామీణ నిరుద్యోగులకు, భూమిలేని నిరుపేదలకు ఆదరణగా నిలుస్తుందని తెలిపారు. ఈ పథకం ద్వారా గ్రామ ప్రజలకు ఆర్థిక భద్రత కలుగుతుందని, ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో ఎండ తీవ్రత నుంచి జాగ్రత్తలు పాటించాలని కూలీలకు సూచించారు.గ్రామాభివృద్ధి దిశగా చేపడుతున్న ఈ పనులతో గ్రామంలో మౌలిక వసతులు మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వాసంపెల్లి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రాజయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీదర్, వార్డు సభ్యులు నరేష్, పద్మ, పర్శరాములు, సమత, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ మద్యం పట్టివేత..

### - 120 లీటర్ల మద్యం స్వాధీనం
### - మద్యం విలువ రూ. 54, 589 అంచనా - నిందితుడి అరెస్ట్

**సూర్య, వేములవాడ**




వేములవాడ పట్టణంలోని శాస్త్రి నగర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం పోలీసుల తనిఖీల్లో పట్టుబడింది. ఈ తనిఖీలలో వివిధ రకాల మద్యం సీసాలు, టిన్‌లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 120.4 లీటర్ల మద్యం పట్టుబడగా, వాటి విలువ సుమారు రూ. 54,589 ఉండనున్నట్లు అంచనా వేశారు. అక్రమ రవాణా, నిల్వపై కేసు నమోదు చేసి, సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇన్స్పెక్టర్ వీర ప్రసాద్ పేర్కొన్నారు.

## నానో ఎరువుల వినియోగంపై అవగాహన

**సూర్య పెగడపల్లి**




సహజ వ్యవసాయం, రైతుల ఆదాయం పెంపు, ఖర్చుల తగ్గింపు నానో ఎరువుల వినియోగంపై మండలంలోని ఎల్లాపూర్ రైతు వేదికలో సోమవారం వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. పెగడపల్లి ధర్మపురి మండల వ్యవసాయ అధికారులు శ్రీకాంత్, రాజ్ మార్ అవగాహనలో భాగంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా సహజ వ్యవసాయం, సహజ పద్ధతుల్లో సాగు చేయడం ద్వారా భూసారాన్ని మెరుగుపరచడం, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించడం వల్ల లాభాలు తెలియజేశారు. నానో యూరియా, నానో డిఏపీ ఎరువులు తక్కువ మోతాదులోనే పంటలకు సమర్థవంతమైన పోషకాలు అందిస్తాయని, ఖర్చు తగ్గడంతో పాటు దిగుబడులు పెరగడంలో సహాయపడతాయన్నారు. పర్యావరణానికి హాని తగ్గి, నేల ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్లాపూర్ సర్పంచ్ పులి రాజేశం, రాజారాం పల్లి సర్పంచ్ రమేష్ నాయక్ ఏఈఓ అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో పర్యవేక్షణ కమిటి ఏర్పాటు

**సూర్య కోనరావుపేట**



కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల్లో సర్పంచ్ సింగం శ్రీహరి అధ్యక్షతన గ్రామ స్థాయి పర్యవేక్షణ కమిటి ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీహరి మాట్లాడుతూ... 3-5 సం. పిల్లలను తప్పని సరిగా అంగన్వాడీ కేంద్రాలకు పంపాలని సూచించారు.చిన్నారులకు అక్షరాబ్యాసం చేస్తారు,గర్భిణీలు బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు అంగన్వాడీ కేంద్రంలో అందించే భోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.కిశోర బాలికలు సమతుల ఆహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లంబ రాజు,అంగన్వాడీ సూపర్ వైజర్ కనుకమ్మ,అంగన్ వాడీ టీచర్లు బూర్గుపల్లి విజయలక్ష్మి, సింగం శ్యామల గడ్డిణీలు, బాలింతలు, తల్లులు పాల్గోన్నారు.

## శ్రీ ధర్మశాస్త్ర మందిర ద్వితీయ కుంబాభిషేక రజితోత్సవ వేడుకలు

**సూర్య సిరిసిల్ల టౌన్**



సిరిసిల్ల శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ ధర్మశాస్త్ర మందిర ద్వితీయ కుంబాభిషేక రజితోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం నిర్వహించిన స్థాపిత ప్రతిష్ట మూర్తులకు మూల మంత్రములచే హోమం, పూజ కార్యక్రమంలో పురపాలక సంఘ అధ్యక్షురాలు జిందం కళా చక్రపాణి దంపతులు పాల్గొన్నారు.శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప దేవస్థానం ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ ధర్మశాస్తా మందిర ద్వితీయ కుంబాభిషేక రజితోత్సవ వేడుకలు ఈనెల 22వ తేదీ నుండి 24వ తేదీ వరకు కనుల పండగగా జరుగుతుండగా దేవస్థానం ట్రస్ట్ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.ఈ వేడుకల్లో భాగంగా సోమవారం లోక కళ్యాణార్థం నిర్వహించిన హోమంలో మున్సిపల్ చైర్పర్సన్ జిందం కళాచక్రపాణి పాల్గొన్నారు.లోకకళ్యాణార్థం ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలు వర్ధిల్లాలని ఈ హోమం నిర్వహించారు.అనంతరం మదనానంద పీఠాధిపతులు శ్రీ శ్రీశ్రీ పరమహంస పరివ్రాజకాచార్యులు సదానంద మాధవార సరస్వతిలు ప్రవచనాలను వెల్లడించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సభ్యులు గెంట్యాల శ్యామల శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ దిడ్డి రమాదేవి శ్రీనివాస్,మాజీ కౌన్సిలర్ గడ్డం చందన భగవాన్, గుడిపాటి చంద్రశేఖర శర్మ గురుస్వామి,శ్రీహరి హర పుత్ర అయ్యప్ప స్వామి దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ రాచ విద్యాసాగర్, గురుస్వాములు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నూతన పాలకవర్గానికి ఘన సన్మానం

**సూర్య మల్లాపూర్**



మండల కేంద్ర గ్రామ పంచాయతీ నూతన పాలకవర్గాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి వాహిని సోమవారం ఘనంగా సన్మానించారు. అనంతరం ఇటీవల కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందుకున్న ల్యాబ్ టెక్నీషియన్ ఉమాదేవి, స్టాఫ్ నర్స్ సుమలతలను పాలకవర్గం, స్థానిక నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్, ఉప సర్పంచ్ గడ్డం సోమ రెడ్డి, వార్డ్ సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన ప్రభుత్వ విప్

**సూర్య కోనరావుపేట**

కోనరావుపేట కొలనూర్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వీరబోయిన తిరుపతి యాదవ్ తల్లి లక్ష్మీ అనారోగ్యంతో ఇటీవలే మృతి చెందగా బాధిత కుటుంబాన్నీ,అలాగే గుండెపోటుతో మృతి చెందిన తుమ్మల స్వామి కుటుంబాన్ని,పెద్ది నర్సయ్య కుటుంబాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సోమవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మార్కెట్ వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా,కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి,మాజీ ప్యాక్స్ ఛైర్మన్ బండ నర్సయ్య యాదవ్,మాజీ సర్పంచ్ అబ్దుల్ రషీద్,మాజీ ఎంపిటిసి ఇస్తారీ ప్రవీణ్, నాయకులుగణేష్,కమలాకర్,తుమ్మల స్వామి,దేవేందర్,సాయి రావు,కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## నాగర్‌కర్నూల్ ఘటనపై ఆగ్రహం...

### - నిందితులకు కఠిన శిక్షల డిమాండ్

**సూర్య తిమ్మాపూర్**

తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మర మల్లన్న జాతరలో చోటుచేసుకున్న దారుణ ఘటనపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతరకు వెళ్లిన రజక కులానికి చెందిన దంపతులపై కొందరు వ్యక్తులు దాడి చేసి, రెండు నెలల శిశువు మృతి చెందడానికి కారణమైన ఘటనను ఖండిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకుల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పొన్నాల సంపత్, గ్రామ ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.



### కాకినాడలోని స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీని

# సందర్శించిన మత్స్య సొసైటీ మహిళా సభ్యులు..

**సూర్య కరీంనగర్**

నాబార్డ్ వారి సౌజన్యంతో జనవికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లి ఫిషరీస్ ఎఫ్ పి ఓ మెంబెర్స్,పెద్దమ్మ తల్లి మ్యాక్స్ సొసైటీ ఫిషర్మెన్ కమ్యూనిటీ మహిళలు పోస్ట్ హార్వెస్టింగ్ టెక్నాలజీ పైన,వేల్యూ ఎడిషన్ పైన విలువ ఆధారిత ఉత్పత్తులుగా తయారుచేసి ఫిష్ ఫుడ్ అవుట్ లెట్స్ ద్వారా వాటిని మార్కెటింగ్ చేయడంతోపాటు ఎక్స్పోర్ట్ కూడా చేసుకోవడం ద్వారా పెద్దమ్మ తల్లి ఫిషరీస్ రైతు ఉత్పత్తిదారుల సంస్థకు అధిక ఆదాయం రావడం జరుగుతుందన్నారు.వీరితోపాటు మ్యాక్స్ సొసైటీ సభ్యులకు కూడా అవుట్లెట్స్ ద్వారా ఆన్లైన్ మార్కెటింగ్ వీటి పైన బ్రాండింగ్,మార్కెటింగ్



పైన అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.చేపల పెంపకం,వాటిని క్లీనింగ్ గ్రీటింగ్ బ్రాండింగ్ వీటితో పాటు వాటి యజమాన్య పద్ధతులు చేపల పెంపకం ద్వారా రైతుల యొక్క ఆదాయాన్ని రెట్టింపు చేయడం జరుగుతుంది అని వెంకటరమణ వెంకటరావు వెంకట్రావు ఎం.వి. రావు సిఐఎఫ్టి విశాఖపట్నం వారు తెలిపారు.అలాగే స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ అడిషనల్ డైరెక్టర్,ప్రిన్సిపల్ అంజలి మేడం కూడా మాట్లాడుతూ ఆక్వా కల్చర్ చేసే రైతులకు ప్రధానమంత్రి మచ్చసంపద యోజన కింద సబ్సిడీలను పొందవచ్చని తెలిపారు.అలాగే ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఫిషరీ సురేష్ వీరితోపాటు అసిస్టెంట్ డైరెక్టర్ ఫిషరీస్ జాస్మిన్,ఫీల్ మేనేజర్ నాగేంద్ర జనవికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యదర్శి జన వికాస కోఆర్డినేటర్ రాజు,సోమేశ్వర్లు వీరితో పాటు ఫిషరీస్ ఎఫ్ పి ఓ సభ్యులు 25మంది పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

**సూర్య, గొల్లపల్లి**



పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా లయన్స్ క్లబ్ ఆఫ్ గొల్లపల్లి మరియు కరీంనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రి సౌజన్యంతో సోమవారం మండల కేంద్రంలోని రెడ్డి సంఘ భవనంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ ముస్కు కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన ఈ శిబిరంలో వివిధ గ్రామాల నుండి వచ్చిన 90 మందికి కంటి పరీక్షలతో పాటు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. వీరిలో 35 మందికి కంటి శుక్లాల ఆపరేషన్లు అవసరమని వైద్యులు గుర్తించారు. ఆపరేషన్లకు ఎంపికైన 35 మందిని రేకుర్తి కంటి ఆసుపత్రికి ప్రత్యేక బస్సులో తరలించారు. ఆపరేషన్ చేయించుకునే వారితో పాటు, వారి వెంట వెళ్లే సహాయకులకు కూడా ఉచిత బస్సు ప్రయాణం, భోజనం మరియు వసతి సౌకర్యాలను కల్పిస్తున్నట్లు కరుణాకర్ రెడ్డి వివరించారు. ఎటువంటి ఖర్చు లేకుండా పేద ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి లయన్ నరహరి, క్లబ్ సభ్యులు, వైద్య బృందం మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నంబర్ ప్లేట్లపై కరీంనగర్ ట్రాఫిక్ పోలీసుల కొరడా

### - 43 వాహనాల సీజ్.

**సూర్య కరీంనగర్**




నగర పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశాల మేరకు, కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు సోమవారం నాడు నగరంలోని 'వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కార్నర్' (I Town Corner) వద్ద వాహనాల నంబర్ ప్లేట్లపై ప్రత్యేక తనిఖీలు (Special Drive) నిర్వహించారు. ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కరీం ఉల్లా ఖాన్ ఆధ్వర్యంలో సిబ్బంది ఈ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.?ఈ తనిఖీల్లో భాగంగా ప్రధానంగా, నంబర్ ప్లేట్లు లేని వాహనాలు,?నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఫ్యాన్సీ నంబర్ ప్లేట్లు, అస్పష్టంగా ఉన్న లేదా ట్యాంపరింగ్ (Tampering) చేసిన నంబర్ ప్లేట్లు, ఇర్రెగ్యులర్ నంబర్ ప్లేట్లు కలిగి ఉన్న వాహనాలపై చర్యలు తీసుకున్నారు.ఈ స్పెషల్ డ్రైవ్లో మొత్తం 43 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వాహన యజమానులపై జరిమానా విధించడంతో పాటు, నిబంధనల ప్రకారం సరైన నంబర్ ప్లేట్లను బిగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కరీమ్ ఉల్లా ఖాన్ తెలిపారు.ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ కరీం ఉల్లా ఖాన్ మాట్లాడుతూ, "వాహనదారులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్పష్టమైన నంబర్ ప్లేట్లను కలిగి ఉండాలని, నంబర్ ప్లేట్లను మార్చడం లేదా అస్పష్టంగా ఉంచడం చట్టరీత్యా నేరం. నేరాల నియంత్రణలో నంబర్ ప్లేట్లు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్ లకు పెనాల్టీ సిస్టం రద్దు చేయాలి

**సూర్య, సెంటినరీ కాలనీ**



సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ లో ఎస్ అండ్ పిసి విభాగంలో టెండర్ నిర్వహిస్తున్న శ్రీజ కాంట్రాక్టు వద్ద పనిచేసే ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్ లకు పెనాల్టీ సిస్టం రద్దు చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ. వెంకన్న డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆర్జీ-3 ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ శబిరుద్దిన్ కి వినతి పత్రం అందచేశారు. ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్స్ కి పెనాల్టీ సిస్టం రద్దు చేయాలని, వేతనం నుంచి రికవరీ చేయడాన్ని నిలిపివేయాలని, ఇప్పటికే రోజుకు టెండర్ ప్రకారం 71 మంది కార్మికులకు గాను 110 మంది ఉన్న కూడా గైహాజరు పేరిట రికవరీ చేయడం జరుగుతున్నదని, కార్మికులకు సరైన రెస్టు, అనుమతులు, గైహాజరు అయినప్పుడు డ్యూటీ కి వచ్చే వాళ్లకు అనుమతిచ్చే పద్ధతి అమలు చేయాలని, అదే విధంగా సెక్యూరిటీ గార్డులకు 21 వేల వేతనం ఉందని ఈఎస్ఐ అమలు కాదని యాజమాన్యం చెప్పడం సరికాదని, ఏ సెక్యూరిటీ కాంటాక్ట్ కార్మికునికి ఇరవై ఒక వెయ్యి రాదని దానిపై పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి అందరికీ ఈఎస్ఐ సౌకర్యం అమలు చేయాలని, అదే విధంగా గత ఐదు సంవత్సరాలుగా ప్రైవేట్ గార్డుల వేతనం నుంచి రికవరీ చేయబడుతున్న సీఎంపిఎఫ్ లెక్కలు నేటికీ కార్మికులకు వివరాలతో ఇవ్వలేదని , కాబట్టి వెంటనే ఈ యొక్క కార్మికుల సీఎం పిఎఫ్ వివరాలు ఆన్లైన్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్ లు ఎం.రమేష్, ఎల్.వినోద్, కే.మధుకర్, జి.చంద్రశేఖర్, డి.కుమార్, పి.మల్లికార్జున్, ఏ.సంజీవ్, కె.రాకేష్, అరవింద్, సాగర్, రాకేష్, జీ.రవి, తదితరులు పాల్గొన్నారు.

## శ్వాసకోశ వ్యాధులు నిర్ధారించడానికి ఎక్సరే.

**సూర్య, సెంటినరీ కాలనీ**



శ్వాసకోస వ్యాధులు నిర్ధారించడానికి ఎక్సరే పరీక్షలు నిర్వహించినట్లు కమాన్ పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చీఫ్ మెడికల్ ఆఫీసర్ గడ్డం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గుండారం గ్రామంలో గ్రామ పంచాయతీలో గుండారం గ్రామంలోని ప్రజలకు ఎక్సరే పరీక్షల కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ జంగిలి పోచాలు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సిహెచ్ఓ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ కోయల్ శ్రీహర్ష ఆదేశాల మేరకు గుండారం గ్రామంలో క్యాంపు నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ పరీక్షల్లో టీబీ, తో పాటు ఇతరత్ర తెమడ,శ్వాసకోశ వ్యాధులు ఉన్నాయా అనే వాటిపై పరీక్షలు నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. సుమారు 90 మందికి పరీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ఇందిరా, ఎక్సరే రేడియో గ్రాఫర్ రమేష్, ఆశ వర్కర్లు మాచర్ల శారద , దండే లావణ్య, అవునూరి హేమలత, ఎరుకల సునీత తదితరులు పాల్గొన్నారు.

## దహన సంస్కారాలకు ఆర్థిక సహాయం అందించిన సర్పంచ్....

**సూర్య - ఎలిగేడు**

ఎలిగేడు మండలం దూళికట్ట గ్రామానికి చెందిన అత్యంత నిరుపేద కుటుంబానికి చెందిన భూసారపు మల్లమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. నివాసానికి సరైన ఇల్లు, భూమి కూడా లేని ఆ కుటుంబం దహన సంస్కారాలు నిర్వహించేందుకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంది.

ఈ విషయం తెలుసుకున్న దూళికట్ట గ్రామ సర్పంచ్ మారం కొమురయ్య యాదవ్ వెంటనే స్పందించి దహన సంస్కారాల ఖర్చుల కోసం రూ. 5,016 ఆర్థిక సహాయం అందజేశారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు.అదేవిధంగా 11వ వార్డు సభ్యులు బత్తిని శ్రీనివాస్ గౌడ్ రూ. 1,016 ఆర్థిక సహాయం అందించి తన సేవాభావాన్ని చాటుకున్నారు.గ్రామ పెద్దలు, ప్రజలు సర్పంచ్ మరియు వార్డు సభ్యుల సేవాభావాన్ని అభినందిస్తూ, ఇలాంటి సహాయ చర్యలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

## మహిళల రక్షణ కై ప్రత్యేక చట్టాలు

**- మహిళ సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ దయ అరుణ**

**సూర్య - పెద్దపల్లి రూరల్**



మహిళల రక్షణ కై కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకొచ్చాయని వాటి పై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ దయ అరుణ అన్నారు. సోమవారం పెద్దపల్లి మండలం పెద్దబొంకూరు మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో సర్పంచ్ లకు రెండో విడత శిక్షణ లో బాగంగా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దయ అరుణ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం ను వృధా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న టోల్ ఫ్రీ నెంబర్ లు 1098, 181, 14567, 155326, 15100 ల గురించి నూతన సర్పంచ్ లకు వివరించారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలని, యువత మత్తు పదార్థాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ లైన్ సతీష్,అధికారులు పాల్గొన్నారు.

## 'పల్లె బాట' పట్టిన మనాలి ఠాకూర్

**సూర్య-గోదావరిఖని:**

రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు ఆయన సతీమణి మనాలి ఠాకూర్ సోమవారం "పల్లె బాట" కార్యక్రమంలో భాగంగా పాలకుర్తి మండలం కుక్కల గూడూరు గ్రామాన్ని సందర్శించారు. ఈ మేరకు మనాలి ఠాకూర్ గ్రామానికి చేరుకున్న వెంటనే గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు హృదయపూర్వక స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు. గ్రామస్తులతో కలిసిమెలిసి మాట్లాడుతూ, ఇళ్లకు వెళ్లి ఆప్యాయంగా పలకరించిన మనాలి ఠాకూర్ సాధారణ కుటుంబ సభ్యురాలిలా అందరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకంగా గ్రామస్తులతో కలిసి కూర్చొని అల్పాహారం స్వీకరించడం మరింత ఆత్మీయతను తీసుకువచ్చింది. ఈ సందర్భంగా గ్రామంలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, పింఛన్లు, రేషన్, గృహ పథకాలు వంటి సమస్యలను ప్రజల నుంచే నేరుగా తెలుసుకున్నారు. వాటిని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ దృష్టికి తీసుకెళ్లి, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు.గ్రామ అభివృద్ధి కోసం ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేయాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తూ, ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం అర్హులందరికీ చేరేలా కృషి చేస్తామని తెలిపారు. "ప్రజల ఆశీస్సులే మా బలం... రామగుండం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్దాం" అని ఆమె భరోసా ఇచ్చారు.



# సింగరేణి ఉన్నతాధికారుల సమీక్షా సమావేశం

## - బొగ్గు నాణ్యత, మార్కెట్ సవాళ్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

**సూర్య-గోదావరిఖని:** పట్టణంలోని ఇల్లందు క్లబ్ లో సోమవారం సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో రామగుండం రీజియన్ పరిధిలోని బొగ్గు గనుల అధికారులతో కీలక సమీక్షా సమావేశం జరిగింది. బొగ్గు మార్కెట్ నుండి వస్తున్న నూతన సవాళ్లను దృష్టిలో ఉంచుకుని బొగ్గు నాణ్యత, కస్టమర్ అవసరాలు, ఉత్పత్తి ప్రమాణాలు, రాబోయే సవాళ్లను ఏ విధంగా అధిగమించాలనే అంశాలపై సింగరేణి మార్కెటింగ్, క్వాలిటీ ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్ర వివరాలు అందించారు. కార్పొరేట్ కు చెందిన క్వాలిటీ జీఎం రవికుమార్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా సింగరేణి సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ, ఇ.డి (కోల్




మూవ్‌మెంట్), చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ పి.వెంకన్న జాదవ్, ఆర్జీ-1 జిఎం డి.లలిత్ కుమార్, జిఎం మార్కెటింగ్, కోఆర్డినేషన్ తాడబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ (ఆపరేషన్స్) సూర్యనారాయణ మాట్లాడుతూ కస్టమర్లను పూర్తిస్థాయిలో సంతృప్తి పరచడం సంస్థ ప్రధాన లక్ష్యమని గుర్తు చేశారు. క్షేత్ర స్థాయిలో పని చేసే ఉద్యోగి నుండి ఉన్నతాధికారుల వరకు ప్రతి ఒక్కరికీ నాణ్యతపై ప్రత్యేక అవగాహన అవసరమని సూచించారు. ప్రస్తుతం రామగుండం రీజియన్‌లో కస్టమర్లు బొగ్గు కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్న నేపథ్యంలో మార్కెట్‌ను కాపాడుకుంటూ 100 శాతం గ్రేడ్ సాటిస్ఫాక్షన్ సాధించేలా పని చేయాలని చెప్పారు. ఇంకా ఈ కార్యక్రమంలో రామగుండం రీజియన్ క్వాలిటీ జి.ఎం పి.వీరభద్ర రావు, ఆర్జీ-1, 2, 3, ఏఎల్‌పి జిఎంలు బి.వెంకటయ్య, మధుసూదన్ తదితరులతోపాటు ఆయా బొగ్గు గనుల ఏజెంట్లు, మేనేజర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. బొగ్గు నాణ్యతను మరింత మెరుగుపరచి మార్కెట్ పోటీతత్వాన్ని ఎదుర్కొనే దిశగా ఈ సమీక్షా సమావేశం కీలకంగా నిలిచింది.

## కుమ్మెర గ్రామం లో పసికందు హత్య దుర్మార్గులను ఉరితీయాలి

### - పెద్దపల్లి జిల్లా రజక సంఘం సమన్వయకర్త నాగేల్లి సాంబయ్య

**సూర్య, సెంటినరీ కాలనీ**



తెలంగాణ రాష్ట్రంలోని నాగర్ కర్నూలు జిల్లా కుమ్మెర గ్రామం లో పసికందు ని హత్య చేసిన దుర్మార్గులను ప్రభుత్వం ఉరి తీయాలని పెద్దపల్లి జిల్లా రజక సంఘం సమన్వయకర్త నాగేల్లి సాంబయ్య డిమాండ్ చేశారు. రామగిరి మండల కేంద్రంలోని సెంటినరీకాలనీలో పెద్దపల్లి జిల్లా రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా రజక సంఘం సమన్వయకర్త నాగేల్లి సాంబయ్య మాట్లాడారు. నాగర్ కర్నూలు జిల్లా కుమ్మెర గ్రామంలో జరిగిన మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం లో భాగంగా దైవ దర్శనానికి వచ్చిన రజక కుటుంబంపై దాడి హత్యను ఖండిస్తున్నామన్నారు. అలాగే కుల వివక్షత చూపుతూ, విచక్షణ రహితంగా కుటుంబాన్ని కొట్టి గుడిలో నుంచి నెట్టేసి అవమానించడమే కాకుండా ఆడబిడ్డ చేతుల్లో ఉన్న చిన్న పసికందును అగ్రకుల అహంకారంతో దుర్మార్గంగా కాలితో తన్ని చంపిన దుర్మార్గులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పెద్దపల్లి జిల్లా రజక సంఘం విద్యార్థి విభాగం నాయకులు బండి రంజిత్, పెద్దపల్లి జిల్లా రజక సంఘం ఉపాధ్యక్షులు మాదాసి శ్రీనివాస్, సంయుక్త కొత్తపెల్లి రాయమల్లు, రామగిరి మండల అధ్యక్షుడు ధర్ముల రాజయ్య, సెంటినరీ కాలనీ రజక సంఘం అధ్యక్షుడు పున్నం సమ్మయ్య, కార్యదర్శి బండి మొండయ్య, రత్నాపూర్ వార్డ్ మెంబర్ పున్నం మణితేజ, అల్వాల రాజు, కొల్లూరి రాములు, కొదురుపాక భీమయ్య, దురిశెట్టి రవి, ధర్ముల భూమయ్య, ధర్ముల శీను, బండి ఓదెలు, దురిశెట్టి విజయ్ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ కమిషనరేట్ పేరు నిలపడం హర్షణీయం.

### - రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా.

**సూర్య, సెంటినరీ కాలనీ**



పోలీస్ క్రీడల్లో రాణించి రామగుండం పోలీస్ కమిషనర్ పేరు ను నలుదిక్కుల వ్యాపించ చేయడం హర్షణీయమని రామగుండం పోలీస్ కమిషనర్ కిషోర్ అంబర్ ఝా అన్నారు. కమాన్ పూర్ పోలీస్ స్టేషన్ లో మహిళా కానిస్టేబుల్ గా పనిచేస్తున్న కూరపాటి శ్రీలతకు క్రీడల్లో గోల్డ్ మెడల్ తో పాటు కాంస్య పథకం సాధించగా రామగుండం కమిషనరేట్ లో కమిషనర్ కిషోర్ అంబర్ ఝా, అడ్మిన్ శ్రీనివాస్, ఈఆర్ఐ ఎసిపి ప్రతాప్, ఏసీపీ మడత రమేష్ తదితరులు అభినందించారు. ఈ నెల 16 వ తేదీ నుండి 20వ తేదీ వరకు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని హైదరాబాదులో తెలంగాణ పోలీస్ గేమ్స్ స్పోర్ట్స్ సింగిల్ లో యోగ ఆర్టిస్ట్ కె అలాగే యోగా ట్రెడిషనల్ లో కాంస్య సాధించింది. దీంతో కమిషనరేట్ లో ఘనంగా సన్మానించి సిపి తో పాటు పలువురు అభినందించారు. రామగుండం పోలీస్ కమిషనర్ రేట్ ను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలవాలని మంచి పేరు తేవాలని కోరారు. ప్రతి పోలీస్ క్రీడాకారుడు, క్రీడాకారిణులు, తమ సత్తా చాటారాన్ని వారికి అందరికీ పోలీస్ కమిషనర్ కిషోర్ అంబర్ ఝా శుభాకాంక్షలు తెలియజేశారు.

## నాణ్యతతో కూడిన బొగ్గు సరఫరా చేయాలి

### - కోల్ మూమెంట్ ఈడి వెంకన్న జాదవ్

**సూర్య, సెంటినరీ కాలనీ**



సింగరేణి సంస్థలో నాణ్యతతో కూడిన బొగ్గు సరఫరా చేయాలని కోల్ మూమెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బదావత్ వెంకన్న జాదవ్ అన్నారు. ఆర్జీ-2 ఏరియా లో సోమవారం ఈడి బదావత్ వెంకన్న జాదవ్ పర్యటించారు. జీఎం బండి వెంకటయ్య ఆయనను సాదరంగా బోకే అందించి ఆహ్వానించారు. అనంతరం ఓసీపీ-3 ప్రాజెక్ట్ లోని మినీ సిహెచ్ పి బంకర్ ను, బొగ్గు సరఫరా ను, క్వారీలో జరుగుతున్న పనులను, బొగ్గు సురక్షితంగా వెలికి తీసే విధానాన్ని, నాణ్యతను పరిశీలించారు. అనంతరం వ్యూ పాయింట్ ద్వారా క్వారీలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కోల్ మూమెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకన్న జాదవ్ మాట్లాడుతూ రాండమ్ గా బొగ్గు శాంపిల్స్ తీయాలని, వినియోగదారుల డిమాండ్ మేరకు నాణ్యమైన బొగ్గును త్వరితగతిన సరఫరా చేయాలని, రక్షణతో కూడిన ఉత్పత్తిని తీయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో కార్పొరేట్ క్వాలిటీ జీఎం రవి కుమార్, మార్కెటింగ్,కో-ఆర్డినేషన్ జీఎం తాడబోయిన శ్రీనివాస్, మార్కెటింగ్ డిజిఎం సురేందర్ రాజు, ఎస్ఓటు జీఎం మాలోత్ రాముడు, క్వాలిటీ డిజిఎం సుభాష్, ప్రాజెక్ట్ ఆఫీసర్ ఉదయ హరిజన్, మేనేజర్ భరత్ కుమార్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ షరీఫ్ మహమ్మద్, షిఫ్ట్ జమేదార్ తక్కళ్ళ రాములు, ఇంటెలిజెన్స్ గార్డ్ మహబూబ్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపన

**సూర్య, సెంటినరీ కాలనీ**

కమాన్ పూర్ మండలంలో రొంపి కుంట గ్రామంలో త్వరలో అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపన చేయడం జరుగుతుందని అంబేద్కర్ సంఘం నాయకులు తెలిపారు. గత నెల గణతంత్ర దినోత్సవం రోజున అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపన కు భూమి పూజ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రతిష్టాపన చేయనున్న అంబేద్కర్ విగ్రహాన్ని ప్రముఖ సింగరేణి కాంట్రాక్టర్ గుమ్మడి అంజయ్య 60 వేల రూపాయల తో కొనుగోలు చేయడం జరిగిందని పేర్కొన్నారు. అంజయ్య సొంత ఖర్చులతో అంబేద్కర్ విగ్రహాన్ని సంఘం నాయకులకు అందజేశారు. అంబేద్కర్ విగ్రహం అందజేసిన అంజయ్యకు అంబేద్కర్ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం గౌరవ అధ్యక్షుడు పులిపాక మొండయ్య, అధ్యక్షుడు పులిపాక శంకరయ్య, ప్రధాన కార్యదర్శి గొట్టే నరసయ్య, ఉపాధ్యక్షుడు పులిపాక మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఉరివేసుకుని వృద్ధుడి ఆత్మహత్య...

**సూర్య - పెద్దపల్లి రూరల్**

మండలంలోని కనగర్తి గ్రామంలో ఎల్లంకి మల్లయ్య (66) ఉరివేసుకుని ఆత్మ హత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు 6 నెలల క్రితం రోడ్డు ప్రమాదం లో కాలు విరిగి ఇంటి వద్ద ఉంటున్నాడు. కాలు నొప్పి తో విసుగు చెంది మద్యం కు బానిస య్యాడు. ఈ క్రమంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మ హత్య చేసుకున్నాడు. మృతుని భార్య చంద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై మల్లేశం తెలిపారు. మృతునికి ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

## ఆయిల్ పామ్ సాగుతో అధిక దిగుబడులు

**సూర్య మల్లాపూర్**

జాతీయ ఆహార భద్రత మిషన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుండంపల్లి గ్రామంలో మండల వ్యవసాయ శాఖ అధికారి లావణ్య రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేట్ ప్రొఫెసర్ డా. సౌమ్య మాట్లాడుతూ.. మొక్కజొన్నలో అధిక దిగుబడులు సాధించడానికి చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. ఆయిల్ పామ్ ఏరియా మేనేజర్ వనోజ్ రెడ్డి మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ ప్రపంచంలోకెల్లా అత్యధిక నూనే దిగుబడిని ఇస్తోందని సంవత్సరానికి నాలుగు నుంచి ఆరు టన్నుల నూనె దిగుబడి వస్తుందని వంటనూనెల ఉత్పత్తిలో ప్రపంచంలోనే ప్రముఖ పాత్ర సంతరించుకున్నదన్నారు. ఆయిల్ పామ్ పండు యొక్క పీచు భాగం నుండి పామాయిల్ గింజల నుండి కెర్నల్ నూనె తీస్తారన్నారు. ఆయిల్ పామ్ సాగుకి 90 శాతం సబ్సిడీ పైన మొక్కలు, డ్రిప్పు అందుబాటులో ఉన్నాయని ఆసక్తి గల రైతులు సంబంధిత హార్టికల్చర్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ శ్రీలత ను సంప్రది ంచాలని సూచించారు. ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్, రైతు ఫోటో లతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి గజానంద్, వంశి, సర్పంచ్ దప్పుల పద్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడుపుల పుష్పలత, గ్రామపంచాయతీ కార్యదర్శి నారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## స్మశాన వాటికకు స్థలం కేటాయించాలని ప్రజావాణిలో వినతి.

**సూర్య రామడుగు**

రామడుగు మండలం గోపాలరావు పేట గ్రామంలో దక్కలి కులస్తులకు స్మశాన వాటిక కోసం ప్రభుత్వ స్థలం కేటాయించాలని సోమవారం జిల్లా కలెక్టర్కు ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. గతంలో గ్రామంలోని సర్వేనెంబర్267/2 లో ఎకరం భూమిని తమ కులస్తులకు ప్రభుత్వ ఇచ్చిందన్నారు. గత 15 ఏళ్ల నుండి స్మశానానికి ఉపయోగించు కుంటున్నామని అన్నారు. కానీ ప్రస్తుతం ఈ భూమిని ప్రభుత్వం మాకే కేటాయించిందని కొందరు రైతులు అడ్డగిస్తున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఇప్పటికైనా ఈ స్థలమును దక్కలి కుటుంబాల స్మశాన వాటికకు ప్రభుత్వం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోటయ్య దక్కనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు బాణాల రవి ఉపాధ్యక్షులు బాణాల తిరుపతి రాజమౌళి సభ్యులు పాల్గొన్నారు.

## ఈడబ్ల్యూఎస్ కోటాలో అగ్రవర్ణ పేదలకు న్యాయం చేయాలి

### - రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎడవెల్లి కొండాల్ రెడ్డి

**సూర్య, హుజురాబాద్**

అగ్రవర్ణ పేదలకు ఈడబ్ల్యూఎస్ కోటాలో రిజర్వేషన్లు కల్పించి న్యాయం చేయాలని బిఆర్ఎస్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఓసి జేఏసి జాతీయ నాయకులు ఎడవెల్లి కొండాల్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఓసి లోని పేదల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం న్యూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మహా ధర్నా జరిగింది. ఈ సందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ... రాజ్యాంగ బద్ధంగా ఏర్పడ్డ 10 శాతం ఈడబ్ల్యూఎస్ పై రాజకీయ పబ్బశీ కోసం కొన్ని దుష్ట శక్తులు ఆయా కులాల్లోని ప్రజలను మభ్య పెడుతూ చేస్తున్న అసత్య ప్రచారాలు, పన్నుతున్న కుట్రలను సాగనివ్వబోమని అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంపొందించడంతో పాటు వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాలంటే జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కూలీల కొరత, పెరుగుతున్న వ్యయాలు, అనిశ్చిత వర్షపాతం వంటి సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పొలాల సమతలీకరణ, చెరువుల పునరుద్ధరణ, కాలువల శుభ్రపరిచే పనులు, వర్షపు నీటి సంరక్షణ, మట్టి సంరక్షణ చర్యలు వంటి కార్యక్రమాలను పథకంలో చేర్చాలని సూచించారు. దీంతో గ్రామీణ కూలీలకు సంవత్సరమంతా ఉపాధి లభించడంతో పాటు వ్యవసాయోత్పత్తి కూడా పెరుగుతుందని పేర్కొన్నారు.వ్యవసాయం దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న నేపథ్యంలో రైతుల అవసరాలకు అనుగుణంగా ఉపాధి హామీ పథకంలో మార్పులు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామీణాభివృద్ధి, ఆహార భద్రత, రైతు ఆదాయం పెంపు లక్ష్యాలతో ఈ రెండు రంగాలను అనుసంధానం చేస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందని అన్నారు.

## రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో

# ‘అరైవ్-అలైవ్’ రెండో దశ ప్రత్యేక డ్రైవ్ ప్రారంభం

### - వాహనదారులకు విస్తృత అవగాహన

**సూర్య-గోదావరిఖని**

రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల ప్రాణ రక్షణ లక్ష్యంగా కొనసాగుతున్న ‘అరైవ్-అలైవ్’ రెండో దశ ప్రత్యేక డ్రైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్ లలో సోమవారం పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు రెండు జిల్లాల పోలీసు అధికారులు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు నిర్లక్ష్య డ్రైవింగ్, రాంగ్ రూట్ ప్రయాణం, లేన్ నిబంధనల ఉల్లంఘనలే ప్రధాన కారణాలనే విషయాలను వాహనదారులు గమనించాలని



కోరారు. రహదారి భద్రత ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు. ఓవర్‌టేకింగ్ కేవలం కుడి వైపు నుంచే చేయాలని, ఎడమవైపు నుంచి దాటడం నిబంధనలకు విరుద్ధం అని చెప్పారు. ముందున్న వాహనాన్ని దాటే ముందు స్పష్టమైన దృశ్యం, తగినంత స్థలం ఉండాలని, ఎదురుగా వచ్చే వాహనాల దిశకు వ్యతిరేకంగా వాహనం నడపడం తీవ్రమైన నేరమని పోలీసులు హెచ్చరించారు. రాంగ్ రూట్ డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాలిడ్ వైట్ లైన్ ఉన్న చోట లేన్ మార్పు చేయరాదని, బ్రోకెన్ వైట్ లైన్ ఉన్న ప్రాంతాల్లో మాత్రమే జాగ్రత్తగా ఓవర్‌టేకింగ్ చేయాలని సూచించారు. లేన్ క్రమశిక్షణ పాటిస్తే ట్రాఫిక్ సాఫీగా సాగి ప్రమాదాలు తగ్గుతాయని అధికారులు వివరించారు. “రోడ్డు భద్రత నిబంధనలు పాటించండి, ప్రాణాలను కాపాడండి, సురక్షితంగా చేరుకోండి” అంటూ ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేశారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించి, బాధ్యతాయుతంగా వాహనాలు నడిపి సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు.

# గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ ధర్నా

**సూర్య సిరిసిల్ల టౌన్**

గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని,మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు.గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు మూషం రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు గ్రామపంచాయతీ కార్మికులకు పని భద్రత కల్పిస్తామని,కనీస వేతనం 26,000 అమలు చేస్తామని,మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేస్తామని అనేక రకాల గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రెండు సంవత్సరాలు కావస్తున్న ఇప్పటికి ఒక్కటి అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తారీకు నాడు వేతనాలు చెల్లిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులకు మాత్రం నాలుగు నెలలు వేతనాలు ఎందుకు పెండింగ్ లో పెట్టారో సమాధానం చెప్పాలన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని రమేష్ డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎగమంటి ఎల్లారెడ్డి,సూరం పద్మ,గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బూర శ్రీనివాస్, కార్యదర్శి మల్యాల నరసయ్య, సిఐటియు జిల్లా నాయకులు రాజశేఖర్, అరకోల్ మల్లయ్య, శ్రీనివాస్,అంజయ్య,మహేష్, నరసయ్య,వీర్నపల్లి నరసయ్య,చీర్లవంచ రవి, ఎల్లారెడ్డిపేట శ్రీనివాస్, మాట్లా ఏళ్ళవ్వ పాల్గొన్నారు.

# ప్రభుత్వం మద్యం పాలసీ విధానాన్ని మార్చాలంటూ కలెక్టరేట్ వద్ద ధర్నా

**సూర్య సిరిసిల్ల టౌన్**

కాంగ్రెస్ ప్రభుత్వం మద్యం పాలసీపై తన విధానాన్ని మార్చుకోవాలంటూ ఏఐఎఫ్టీయూ న్యూ, పిఓడబ్ల్యు స్త్రీ సంఘటన ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్టియు న్యూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ సోమిశెట్టి దశరథం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత గత ప్రభుత్వాల మాదిరిగానే మద్యం వ్యాపారం నిర్వహిస్తూ మద్యంపై వచ్చే ఆదాయంతోనే ప్రభుత్వాలు నడపాలని చూడడం సిగ్గుచేటని అన్నారు. ప్రభుత్వం తన మద్యం పాలసీ విధానాన్ని మార్చుకోవాలని,రాష్ట్రంలోని బెల్టు షాపులను ఎత్తివేస్తూ



మద్యం షాపులకు అనుబంధంగా ఉన్న పర్మిట్ రూములలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నటువంటి వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మంచినీళ్లకు కొదవ ఉందేమో.. మద్యానికి మాత్రం కొదవ లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్నటువంటి పరిమిట్ రూములపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా బెల్టు షాపులను పూర్తిస్థాయిలో నియంత్రించాలని లేనిపక్షంలో ఉద్యమాలగడ్డ సిరిసిల్ల నుండి కాంగ్రెస్ ప్రభుత్వంపై మరో ఉద్యమానికి నాంది పలుకుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యూ స్త్రీ సంఘటన నాయకురాలు కామ్రేడ్ మచ్చ అనసూర్య,గుజ్జె దేవదాస్, జక్కని సరవ్వ,రాజేశ్వరి,సత్తవ్వ,లత, ఉమ,పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# “ఆఖరి మజిలీకి” ఆశ్రమ నిర్వాహకుడే అంతిమ సంస్కారాలు”

### - 13 మంది అనాధ “శవాల చితికి నిప్పు”

**సూర్య రామడుగు**

ఎందరో అనాథ వృద్ధులకు ఆశ్రయాన్ని కల్పిస్తూ ఉదయం లేచినప్పటి నుండి రాత్రి పడుకునే వరకు చూసుకోవడమే కాకుండా చివరికి అనారోగ్యంతో మృతి చెందిన చివరికి చితికి నిప్పు పెట్టేందుకు కూడా కన్న కొడుకులు కుమార్తెలు రాకపోవడంతో చివరికి ఆశ్రమ నిర్వాకుడే అనాథ శవాలకు చితికి నిప్పు పెట్టి ఆదర్శవంతంగా నిలుస్తున్నాడు మంచికట్ల శ్రీనివాస్ మరి వివరాలు ఏంటో చూద్దామా.. రామడుగు మండలం దేశరాజు పల్లి గ్రామంలో స్పందన అనాథ వృద్ధుల ఆశ్రమాన్ని మంచికట్ల శ్రీనివాస్ అనే వ్యక్తి గత కొద్ది సంవత్సరాల నుండి నిర్వహిస్తున్నాడు. ఆశ్రమంలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న కొత్తకొండ గ్రామానికి చెందిన కడారి ఐలయ్య మృతి చెందారు. ఐలయ్యకు కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో గత కొన్ని సంవత్సరాలుగా స్పందన అనాథ ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్నాడు. గత వారం రోజుల నుండి అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆదివారంమృతి చెందారు. అతని బంధువులకు సమాచారం ఇవ్వగా ఎవరూ కూడా స్పందించకపోవడంతో చివరిగా స్పందన అనాథ వృద్ధుల ఆశ్రమం నిర్వాహకుడు మంచికట్ల శ్రీనివాస్ అనాథ వృద్ధ శవానికి కన్న కొడుకు వలె చితికి నిప్పు పెట్టి అంత్యక్రియ ఆఖరి మజిలీ అంత్యక్రియలు నిర్వహించారు. ఇప్పటివరకు ఈ అనాథ ఆశ్రమంలో 13 మంది వృద్ధ అనాథ శవాలకు కన్న కొడుకులు కుమార్తెలు బంధువులు ఎవరు రాకపోవడంతో ఆఖరి ఘట్టానికి కన్న కొడుకుల మారి చితికి నిప్పు పెట్టి స్పందన ఆశ్రమ నిర్వాకుడు మంచి కట్ల శ్రీనివాస్ ఆదర్శంగా నిలిచాడు.. మరి ఇటువంటి సేవా భవంతు ముందుకు వెళుతున్న శ్రీనివాసును మనము అభినందిద్దాం.



# సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర కార్యదర్శిగా ఊరడీ ఆనంద్ యాదవ్

**సూర్య కరీంనగర్**



సామాజిక న్యాయవేదిక రాష్ట్ర కార్యదర్శిగా కరీంనగర్ నివాసి ఉరడి ఆనంద్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు ఏష బోయిన సాంబయ్య యాదవ్ తెలిపారు. కరీం నగర్ జిల్లాలో సామాజిక న్యాయ వేదిక బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని, తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర నాయకత్వనికి ధన్య వాదాలు తెలియజేస్తున్నట్లు ఊరడి ఆనంద్ చెప్పారు.

# సిపిఎస్ ఉద్యోగుల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలి

**సూర్య సారంగాపూర్**



తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగులకు రావాల్సిన డిఏ వాయిదాల బకాయిలను తెలంగాణ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్స్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సారంగాపూర్ మండల కేంద్రం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పాఠశాల సముదాయ సమావేశంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గంగాధరి మహేష్ మాట్లాడుతూ సిపిఎస్ ఉద్యోగులకు రావాల్సిన డీఏలను వాయిదాల రూపంలో చెల్లించడం బాధాకరమని, ప్రభుత్వం సకాలంలో వీటిని చెల్లించకుండా వాయిదాల సంఖ్యను పెంచుకుంటూ పోవడం వల్ల వాయిదాల ద్వారా రావలసిన మొత్తం సుమారు 1200 కోట్లకు చేరడం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రతి నెల విడుదల చేస్తున్న 700 కోట్ల నిధులలో భాగంగా ఫిబ్రవరి నెల తప్పనిసరిగా సీపీఎస్ బకాయిల కోసం కేటాయించాలని కోరారు. అలాగే గత ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం వెంటనే స్పందించి తెలంగాణలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్ శ్రీనివాస్,శంకర్, శ్రీనివాస్, ప్రవీణ్,ఉమేష్, మురళి, మునీందర్, రాజు,శ్రవణ్, నవీన్, వసంత, రేఖ,హేమలత, శ్రీలత, వాసవి పాల్గొన్నారు.

# పలు కేసుల్లో 14 మంది వ్యక్తుల బైండోవర్

**సూర్య కరీంనగర్**



కరీంనగర్ రూరల్ పోలీసులు పలు కేసుల్లో 14 మంది వ్యక్తులను బైండోవర్ చేసినట్లు సిఐ ఏ.నిరంజన్ రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళితే ఇటీవల అక్రమ ఇసుక రవాణా చేస్తూ పట్టుబడిన సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన కన్నం అనిల్, బండారి రాజు, వడ్లకొండ రాజ్ కుమార్, సిలివేరి శ్రీకాంత్, దర్శనాల లక్ష్మణ్, మానకొండూరు మండలం రాఘవపూర్ గ్రామానికి చెందిన తిట్ల అనిల్, వెల్ది గ్రామానికి చెందిన ఆరేల్లి సాయికుమార్ అనువారిని, అతిగా మద్యం సేవించి ప్రజలకు ఇబ్బంది కలిగించిన ఏడుగురు వ్యక్తులు వనపర్తి వంశీకృష్ణ, చాడ రామచంద్రారెడ్డి, ఆవుల శివ గణేష్, చింతల మనోజ్ కుమార్, మద్రి భరత్ చంద్ర, చిలుముల సాకేత్ రామ్,శనిగారపు ప్రణీత్ అను వారిని కరీంనగర్ రూరల్ మండలం తాసిల్దార్ ముందు హాజరు పరిచి లక్ష రూపాయల పూచికత్తుపై బైండోవర్ చేయడమైనది. ఎవరైనా చట్ట వ్యతిరేకమైన పనులకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

# రైతు భరోసాను వెంటనే విడుదల చేయాలి

### - బిజెపి కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు చింతకుంట సాగర్

**సూర్య చందుర్తి**



ఏసంగి వరి నాట్లు పూర్తి అయి రోజులు గడుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాను విడుదల చేయడంలో జాప్యం చేయడం తగదు అని ఇప్పటికైనా భరోసా నిధులు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని, చందుర్తి మండల బిజెపి కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు చింతకుంట సాగర్ అన్నారు రైతుల పక్షపాతి అని చెప్పుకునే ప్రభుత్వం రైతులకు చేసిందేమీ లేదని 2 లక్షల రుణమాఫీ సైతం పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో బిజెపి కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు సమగ్ర చర్యలు

## - డీఆర్ఎస్సీ సమావేశంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

జగిత్యాల జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీఆర్ఎస్సీ చైర్మన్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. సోమవారం జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశంలో వివిధ శాఖల అధికారులతో రోడ్డు భద్రత అంశాలపై జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగిత్యాల పట్టణంలోని ట్రాఫిక్ సిగ్నల్స్ పనితీరును చైర్మన్ సమీక్షించి, సిగ్నల్స్ మరమ్మత్తులకు సంబంధిత ఏజెన్సీకి నోటీసులు జారీ చేసినట్లు ఆర్అండ్బి అధికారులు తెలిపారు. మంచినీళ్ల బావి సమీపంలో లైట్లు మార్పు, పోల్ మరమ్మత్తులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశించారు. బస్టాండ్ ప్రాంగణంలో సీసీ కెమెరాల లభ్యతపై సమీక్షించి, పార్కింగ్ ప్రాంతంలో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ డిపో మేనేజర్‌ను




ఆదేశించారు. సమీప ఆసుపత్రులకు తగినంత అంబులెన్సులు అందుబాటులో ఉండేలా డీఎంహెచ్ఓను సూచించారు. కొండగట్టు ప్రాంతంలో బీటీ రోడ్డుకు ఆనుకుని ఉన్న ఆక్రమణలను తొలగించి, ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని ఎన్‌హెచ్ అధికారులకు సూచించారు. ప్రమాదాలకు కారణమవుతున్న ఎత్తైన బెర్మ్స్ తొలగించాలని ఆదేశించారు. జిల్లాలోని 8 బ్లాక్ స్పాట్ ప్రాంతాలపై ఆర్అండ్బి శాఖ సమీక్ష జరిపింది. జగిత్యాల-పెద్దపల్లి రోడ్డులో రెండు ప్రాంతాల్లో పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. రాయపట్నం-కోదాడ రోడ్డులో రూ.23 లక్షల అంచనాతో సాంకేతిక అనుమతులు పొందినట్లు పేర్కొన్నారు. చైతన్య పాఠశాల సమీపంలో రూ.21.50 లక్షల ప్యాకేజ్ పనులకు అనుమతి లభించిందని తెలిపారు. మెట్పల్లి-రంగారావుపేట రోడ్డులో రూ.12 లక్షల అంచనాతో ప్రతిపాదనలు సమర్పించామని వెల్లడించారు. వెల్గటూర్ వంతెనపై విద్యుత్ స్తంభాల మార్పు అనంతరం రోడ్డు భద్రత పనులు చేపడతామని అధికారులు తెలిపారు. గొల్లపల్లి బైపాస్ రోడ్డులో భవాని బార్ సమీపంలో గుంతలు పూడ్చే పనులను తక్షణమే చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కోరుట్ల పట్టణంలో పాఠశాల జోన్లు, ముఖ్య కూడళ్ల వద్ద రంబుల్ స్ట్రిప్స్ అవసరమని మున్సిపల్ కమిషనర్ పేర్కొన్నారు. మెట్పల్లిలో ఆరపేట వై-జంక్షన్, పాత బస్టాండ్ వద్ద భద్రతా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులు సూచించారు. ఈ సమావేశంలో రోడ్ సేఫ్టీ కమిటీ సభ్యులు, ఆర్డీవోలు, జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధిలో గల్ఫ్ గ్రూప్ సభ్యులు

**సూర్య చందుర్తి**

విదేశాల్లో ఉండి కూడా గ్రామాభివృద్ధికి సహాయం చేయవచ్చని చందుర్తి మండలం మల్యాల గ్రామ వాస్తవ్యులు పొట్ట కూటి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లిన వారు వాట్సప్ గ్రూపు సభ్యులుగా ఏర్పడి దాదాపు 3 లక్షల రూపాయలు చందాలుగా పోగుచేసి వైకుంఠ రథాన్ని తయారు చేయించారు .ఇట్టి రథాన్ని గ్రామ పంచాయతీ వారికిసోమవారం అప్పగించడం జరిగింది. అంతేకాకుండా ఇప్పటివరకు 15 లక్షల రూపాయలను చందాలుగా తయారుచేసి గ్రామంలో వివిధ కార్యక్రమాలకు పంపించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వేములవాడ ఎఎస్పీ రిత్విక్ సాయి మాట్లాడుతూపొట్టకూటి కోసం విదేశానికి వెళ్లి కొన్ని సందర్భాల్లో బిజి లైఫ్ లో ఉండి గ్రామాన్ని పట్టించుకునే పరిస్థితి



లేకున్నా వారి కష్టార్జితం నుండి గ్రామాభివృద్ధికి సహాయం చేయాలన్న స్ఫూర్తితో వాట్సాప్ గ్రూప్‌గా ఏర్పడి చందాలతో వైకుంఠ రథాన్ని తయారు చేయించి గ్రామానికి అందించిన గ్రామాభివృద్ధి కమిటీ - దుబాయ్ గ్రూపు సభ్యులను అభినందిస్తూ పుట్టినప్పుడు చాలా వేడుకలు ఏ విధంగా అయితే చేసుకుంటామో చనిపోయిన వారిని కూడా సకల మర్యాదలు చేయాలని సుప్రీంకోర్టు హక్కు కల్పించారని అన్నారు. గ్రామానికి అందించిన వైకుంఠ రథాన్ని గ్రామపంచాయతీ వారు కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఇట్టి కార్యక్రమంలో చందుర్తి సిఐ వెంకటేశ్వర్లు, ఎస్సై జిల్లెల్ల రమేష్, గ్రామ సర్పంచ్ మందాల శారద, ఉపసర్పంచి అనపర్తి నరేష్ కుమార్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శరత్ చంద్ర, గ్రామ వార్డు సభ్యులు పత్తిపాక లావణ్య, అర్షం అనూష, ఈసరి శిల్ప, లింగాల శ్రీనివాస్,పాటి సుధాకర్, తూమ్ గణేష్, గుంటపల్లి నారాయణ, పిట్ల మనోహర్, లక్కే సుదర్శన్,దుబాయ్ గ్రూప్ సభ్యులు పులి భాస్కర్,కొట్టే ప్రసాద్,అర్సం లోహిత్, ద్యావనపెల్లి లక్ష్మీనారాయణ, కోన నరేష్, కొడగంటి గంగా ధర్, కొడగంటి దేవయ్య, నరేష్,మదు సూధన్, తోగరి గంగాధర్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈసరి శ్రీనివాస్, గ్రామస్తులు యువకులు మహిళలు ప్రజలు పాల్గొన్నారు.

# వేసవిలో పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా నిరంతర విద్యుత్ సరఫరా

## - సూపరింటెండింగ్ ఇంజనీర్ వి గంగాధర్

**సూర్య కరీంనగర్**

ఎన్పీడీసియల్ పరిధిలో విద్యుత్ డిమాండ్ గత ఏడాది మార్చి నెలలో 5,816 మెగావాట్లు ఉండగా, ఈ సంవత్సరం ఫిబ్రవరి 21 నాటికి 5,904 మెగావాట్లకు చేరిందని కరీంనగర్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ వి గంగాధర్ తెలిపారు. రాబోయే వేసవిలో పీక్ డిమాండ్ ఎంత పెరిగినా దానికి అనుగుణంగా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించేందుకు అన్ని ముందస్తు చర్యలు చేపట్టామని వెల్లడించారు. వేసవి అవసరాలను దృష్టిలో ఉంచుకుని పట్టణ ప్రాంతాల్లో లోడ్ పెరుగుదల అంచనాల మేరకు ఓవర్‌లోడ్ అవుతున్న 141 పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచినట్లు తెలిపారు.



అదనంగా 116 కొత్త పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో పాటు,అవసరమైన చోట్ల 9 సంఖ్య పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే 4 కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టినట్లు, అవసరమైన ప్రాంతాల్లో 32 కొత్త బ్రేకర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరా నాణ్యత మెరుగుపరిచేందుకు 29 సంఖ్య 33/11 కేవీ ఇంటర్‌లింకింగ్ లైన్లను కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు. వేసవికాలంలో వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు అన్ని స్థాయిల్లో ముందస్తు చర్యలు పూర్తిచేసినట్లు తెలిపారు. ఎటువంటి అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా కొనసాగించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో కంకణబద్ధంగా పనిచేస్తున్నారని సూపరింటెండింగ్ ఇంజనీర్ స్పష్టం చేశారు.

# లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ వేదికకు ఏర్పాట్లు

**సూర్య ధర్మపురి**

జగిత్యాల జిల్లా ధర్మపురి క్షేత్రంలో ఈ నెల 27 నుండి జరుగు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా 28న జరగనున్న స్వామి వారి కళ్యాణం జరుగు స్థలాన్ని



సోమవారం దేవస్థానం ఆధ్వర్యంలో చదును చేశారు. స్వామి వారి కల్యాణము జరుగు వేదిక వద్ద మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు పనులను వేగవంతం చేసినట్లు దేవస్థాన చైర్మన్ జక్కు రవీందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో మున్సి పల్ వైస్ చైర్మన్ ఇందారపు రామన్న,ధర్మకర్తల మండలి సభ్యులు స్తంభం కాడి గణేష్, బొల్లారపు పోశయ్య, దేవస్థాన సూపరిండెంట్ ధ్యావల్ల కిరణ్, మున్సిపల్ ఆర్ఐ గంగాధర్, సానిటరీ ఇన్స్పెక్టర్ గంగాధర్‌లు పాల్గొన్నారు.

# మహేంద్ర సంఘ భవనముకు నిధులు కేటాయించాలి

**సూర్య సారంగాపూర్**

సారంగాపూర్ మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో మహేంద్ర



కుల సంఘ భవనంనకు నిధులు కేటాయించాలని కోరుతూ సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని మాజీ జిల్లా పరిషత్ అధ్యక్షురాలు దావ వసంత సురేష్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దావ వసంత నిధుల మంజూరుకు సానుకూలంగా స్పందించినట్లు సంఘ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సాంబార్ గంగాధర్, యువ నాయకులు పాంపర్తి రంజిత్,సిలివేరి రమేష్,జక్కుల నరేష్,చింతల రమేష్,సాగర్, చిట్ల రమణ పాల్గొన్నారు.

# వార్డ్ మెంబర్ శిక్షణలో పాపను లాలిస్తున్న జీపీ సిబ్బంది

**సూర్య బోయిన్పల్లి**

మండలంలోని కొదురుపాక రైతు వేదిక వద్ద ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మొదటి రోజు ప్రారంభమైన వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమంలో ఒక గ్రామ వార్డు సభ్యురాలు తన పాపతో ట్రైనింగ్‌కు హాజరైన సందర్భంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాపని దగ్గరకు తీసుకొని లాలిస్తూ



ఉంటే తల్లి శిక్షణా తరగతులు ఉండి శిక్షణ తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పాపను ఆడిస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది పలువురు అధికారులు అభినందించారు.

# బేతిగల్‌లో ఘనంగా భూలక్ష్మి బ్రహ్మోత్సవాలు

**సూర్య, వీణవంక**

వీణవంక మండలం బేతిగల్ గ్రామంలో భూలక్ష్మి - మహాలక్ష్మి, పోచమ్మ దేవతల ప్రతిష్టాపన ప్రథమ



వార్షికోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి.రెండో రోజు సోమవారం వేడుకల్లో భాగంగా అర్చకులు నరసింహాచార్యుల ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యహవాచనం, రక్షాబంధనం, అంకురార్పణ, మండప ఆరాధన వంటి ప్రత్యేక క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామ ఆడబిడ్డలు, మహిళలు మంగళహారతులతో తరలివచ్చి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మహా అన్నదాన ప్రసాదరణ నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

# శ్రీ సాయిరాం ఇంగ్లీష్ మీడియం పాఠశాలపై డి.ఈ.ఓ చర్యలు తీసుకోవాలి

## - ఎన్.ఎస్.యు.ఐ మండల ప్రెసిడెంట్ పసునూటి అన్వేష్


**సూర్య, ఇల్లందకుంట**

ఇల్లందకుంట మండల కేంద్రంలోని బూజునూర్ గ్రామంలో ఉన్నటువంటి శ్రీ సాయిరాం ఇంగ్లీష్ మీడియం పాఠశాలపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని





ఇల్లందకుంట మండల ఎన్.ఎస్.యు.ఐ ప్రెసిడెంట్ పసునూటి అన్వేష్ కోరారు. ఎందుకంటే గత ప్రభుత్వాలు రేకుల షేడ్ లలో పాఠశాలలు నిషేధించి కొత్త భవనాలలో విద్యను బోధించాలి అని నిర్ణయిస్తే ఈ పాఠశాల యాజమాన్యం మాత్రం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తూ ఆ షెడ్డులలోనే తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. ఒకవేళ జరగరానిది ఏదైనా జరిగి విద్యార్థులకు ఏదైనా హాని కలిగితే దానికి పూర్తి బాధ్యత ఎవరు వహిస్తారన్నారు? అంతే కాకుండ వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తూ లాభర్జనే ధ్యేయంగా ఆలోచించి కనీసం విద్యార్థులకు ఎలాంటి సౌకర్యాలు లేకుండా, వాష్ రూమ్ లు లేకుండా పాఠశాల నడిపిస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్న ఈ పాఠశాలపై వెంటనే



డి.ఈ.ఓ చర్యలు తీసుకొని, విద్యార్థులకు న్యాయం చెయ్యాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేని యెడల పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరిస్తున్నామన్నారు.

# పిఎంజెజెబివై చెక్కు అందజేసిన యూనియన్ బ్యాంకు మేనేజరు

**సూర్య,రాయికల్**

రాయికల్ మండలంలోనీ కొత్తపేట గ్రామానికి చెందిన టి.రాజేందర్ పిఎంజెజెబివై భీమా పథకం రూ.436 ప్రీమియంను ఆర్థిక అక్షరాస్యత



కేంద్రం-మేడిపల్లి వారిచే పిఎంజెజెబివై పథకంలో చేరగా,ఇటీవలే లబ్దిదారుడు మరణించిన విషయాన్ని ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్ నాగేంద్రప్రసాద్ తెలుసుకొని సంబంధిత పత్రాలను యూనియన్ బ్యాంకు మేనేజర్ నరేష్‌కి అందజేశారు.కాగా భీమా 2లక్షల రూపాయల చెక్కును నామినిగా ఉన్న అతని భార్య లహరికి అందజేశారు.ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకు ఖాతా కలిగిన ప్రతి ఒక్కరు పిఎం ఎస్ బి వై, పిఎం జెజెబివై ప్రభుత్వ భీమా పథకాలలో చేరాలని కోరారు.ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ నరేష్,యూనియన్ బ్యాంకు సిబ్బంది,ఆర్థిక అక్షరాస్యత కేంద్రం మేడిపల్లి కౌన్సిలర్లు నాగేంద్రప్రసాద్,నవీన్,మేఘమాల తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనకు సమిష్టి కృషి అవసరం

**-జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా విద్యాసంస్థల పరిసరాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. యువతలో మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా



వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణను అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. విద్యాసంస్థల పరిసరాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, యువతను దారి తప్పించే వ్యక్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై స్పష్టమైన అవగాహన కల్పించాలని తెలిపారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, బాధితులకు అవసరమైన పునరావాస సేవలు అందించేందుకు కూడా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. సమాజంలోని ప్రతి ఒక్కరి సహకారంతో మాదకద్రవ్యాల రహిత జిల్లాను నిర్మించగలమని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్, మెట్ పెల్లి, కోరుట్ల ఆర్డీవోలు శ్రీనివాస్, జివాకర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కె. రాజ్ కుమార్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రఘువరన్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి సుజాత, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నారాయణ, జిల్లా విద్యాధికారి కె. రాము, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడికి నిరసనగా

# ఎలిగేడు మండలంలో నల్లబ్యాడ్జీలతో ఆందోళన

**సూర్య - ఎలిగేడు**

కామారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై జరిగిన దాడిని ఖండిస్తూ బిజేపీ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఎలిగేడు మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కర్రే సంజీవరెడ్డి పిలుపు మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బిజేపీ నాయకులు, కార్యకర్తలు నల్లబ్యాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు గాదె రంజిత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ భేదాభిప్రాయాలు సహజమని, అయితే వాటిని హింసాత్మక చర్యల ద్వారా వ్యక్తపరచడం అసహ్యకరమని అన్నారు.



కామారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై జరిగిన దాడి ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఇటువంటి దాడులు కొనసాగితే కాంగ్రెస్ పార్టీ తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. రాజకీయ హింసకు అడ్డుకట్ట వేయడం ప్రతి పార్టీ బాధ్యత అని అన్నారు. నిరసన అనంతరం తహసీల్దార్‌కు మెమోరాండం సమర్పించి, దాడికి పాల్పడిన వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడాలని, ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గోపు సురేందరరెడ్డి, కొత్తిరెడ్డి వేణుగోపాలరెడ్డి, అడ్డగుంట తిరుపతి గౌడ్, మల్లారపు అంజయ్య, ఎల్క శంకర్, బోగే కిరణ్, అమరగొండ భాస్కర్, కలకొండ విక్రమ్ రెడ్డి, అమరగోని శ్రీనివాస్, దేవ పవన్, దేవ జస్వంత్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పలువురు బిజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై నిరసన కార్యక్రమానికి సంఘీభావం తెలిపారు.

## ఫారెస్టు అధికారులపై దాడి కేసులో నలుగురికి 6నెలల జైలు శిక్ష 2వేల రూపాయల జరిమానా

**సూర్య రుద్రంగి**



ఫారెస్టు అధికారులపై దాడి కేసులో నలుగురు వ్యక్తులకు వేములవాడ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జ్యోతిర్మయి ఆరు నెలల జైలు శిక్ష, 2వేల రూపాయల జరిమానా విధించినట్లు రుద్రంగి ఎస్ఐ మోతిరాం సోమవారం ప్రకటనలో తెలిపారు. ఎస్ఐ మోతిరాం తెలిపిన వివరాల ప్రకారం 2018 సంవత్సరంలో మానాల గ్రామానికి చెందిన గుగులోత్ మదన్, గుగులోత్ గజన్, అజ్మీర బన్సీ, బత్తుల లక్ష్మయ్యలు ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ సిద్ధార్థపై భౌతిక దాడి చేసి గాయపరిచినారని ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ ఎస్.విద్యాసాగర్రావు కేసు నమోదు చేసి కోర్టు నందు చార్జ్ షీట్ దాఖలు చేశారన్నారు. దీనిపైవేములవాడ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జ్యోతిర్మయి సాక్షాధారాలు పరిశీలించి నిందితులు గుగులోత్ మదన్, గుగులోత్ గజన్, అజ్మీర బన్సీ, బత్తుల లక్ష్మయ్యలకు ఆరు నెలల జైలు శిక్ష, 2వేల రూపాయల జరిమాన విధించడం జరిగిందన్నారు. ప్రభుత్వ అధికారులు, ఫారెస్టు సిబ్బందిపై ఎవరైనా దాడి చేసిన విధులకు ఆటంకం కలిగించిన వారి పైన కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని రుద్రంగి ఎస్ఐ మోతిరాం తెలిపారు.

## నాగర్‌కర్నూల్ ఘటనపై ఆగ్రహం...

**- నిందితులకు కఠిన శిక్షల డిమాండ్**

**సూర్య తిమ్మాపూర్**

తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మర మల్లన్న జాతరలో చోటుచేసుకున్న దారుణ ఘటనపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతరకు వెళ్లిన రజక కులానికి చెందిన దంపతులపై కొందరు వ్యక్తులు దాడి చేసి, రెండు నెలల శిశువు మృతి చెందడానికి కారణమైన ఘటనను ఖండిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకుల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు.

## మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్ట్ ఖండించిన ప్రసాద్

**సూర్య సారంగాపూర్**



మంచిర్యాల జిల్లా చెన్నూరు మాజీ ఎమ్మెల్యే మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అరెస్ట్ ను తీవ్రంగా ఖండిస్తున్నట్లు జగిత్యాల జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ కమిటీ మాజీ సభ్యులు ఎండబెట్ల ప్రసాద్ పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లాలోని కేతనపల్లి మున్సిపాలిటీలో ఇటీవల మున్సిపల్ ఎన్నికల ఫలితాలలో టిఆర్ఎస్ పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఉన్నప్పటికి తెలంగాణ రాష్ట్ర మంత్రి చెన్నూరు శాసనసభ్యులు వివేక్ వెంకటస్వామి దౌర్జన్యంగా అధికారుల అండదండలతో టిఆర్ఎస్ కౌన్సిలర్ లను బెదిరించి కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ పీఠం దక్కించుకున్నట్లు ఆరోపించారు. పోలీసులు అధికార పార్టీ కనుసన్నలలో పనిచేయడం దురదృష్టకరమన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో స్పష్టమైన మెజారిటీ ఉన్నప్పటికీ అధికారాన్ని ఉపయోగించి మున్సిపల్ పీఠాన్ని చేజిక్కి0చుకోవడంతోపాటు ప్రజాస్వామ్యాన్ని అమలు పరిచే అధికారుల తీరును తప్పుతప్పుబట్టిన చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పై కేసులు నమోదు చేసి,తన ఇంటిలో నుండి దౌర్జన్యంగా పోలీసులు ఎత్తుకెళ్లి రిమాండ్ తరలించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. బేషరతుగా బాల్క సుమన్ పై పెట్టిన కేసులను ఎత్తివేయడంతోపాటు జైలు నుండి వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వెంట బి ఆర్ ఎస్ నాయకులు సాంబార్ గంగాధర్, అనంతుల గంగారెడ్డి, బైరి మల్లేష్, ఓడ్నాల జగన్ ఉన్నారు.

## నూతన పాలకవర్గానికి ఘన సన్మానం

**సూర్య మల్లాపూర్**

మండల కేంద్ర గ్రామ పంచాయతీ నూతన పాలకవర్గాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి వాహిని సోమవారం ఘనంగా సన్మానించారు. అనంతరం ఇటీవల కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందుకున్న ల్యాబ్ టెక్నిషీయన్ ఉమాదేవి, స్టాఫ్ నర్స్ సుమలత లను పాలకవర్గం, స్థానిక నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్, ఉప సర్పంచ్ గడ్డం సోమ రెడ్డి, వార్డ్ సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామంలో పారిశుద్ధ్యం కు పెద్దపీట

**సూర్య సెంటినరీ కాలనీ**



కమాన్ పూర్ మండలం జూలపల్లి గ్రామంలో పారిశుద్ధ్యానికి పెద్దపీట వేయడం జరుగుతుందని గ్రామ సర్పంచ్ పోలుదాసరి వనిత సాయికుమార్ అన్నారు. జూలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో మొత్తం మురికి కాలువలను ప్రైవేట్ కూలీల ద్వారా తీసే కార్యక్రమాన్ని సోమవారం మొదలు పెట్టారు. ఆయా పనులను సర్పంచ్ పోల్ దాసరి వనిత సాయికుమార్, ఉప సర్పంచ్ గడ్డం రాజ మహేందర్, గ్రామపంచాయతీ ఇన్చార్జి కార్యదర్శి ఆమీన భాను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో చెత్తాచెదారం లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు సైతం చెత్తను డ్రైనేజీల్లో కాకుండా, తమ ఇండ్ల ముందు వేయకూడదని ట్రాక్టర్ వచ్చిన సమయంలో ట్రాక్టర్లో వేయాలని సూచించారు.

## ఆశా కార్యకర్తల ముందస్తు అరెస్ట్ అమానుషం

**సూర్య మల్లాపూర్**



తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ పిలుపునిచ్చిన చలో హైదరాబాద్ ఆరోగ్య శాఖ కమిషనరేట్ ధర్నా కార్యక్రమానికి వెళుతున్న ఆశా కార్యకర్తలను ముందస్తు అరెస్ట్ చేయడం అమానుషం అని ఆశా కార్యకర్తల యూనియన్ మండల అధ్యక్షురాలు అనూష, జల అన్నారు. హక్కుల సాధన కోసం చేస్తున్న పోరాటాన్ని ప్రతీసారి అడ్డుకోవడం పై మండి పడ్డారు. ఆరోగ్య సమాజం కోసం గ్రామాల్లో నిరంతర సేవలందిస్తున్న ఆశ కార్యకర్తలకు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం 18వేల ఫిక్స్‌డ్ వేతనం, ఉద్యోగ భద్రత నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించే వరకు ఉద్యమం ఆపే ప్రసక్తి లేదన్నారు. ఈ కార్యక్రమంలో శారద, లత, సరిత, సంయుక్త, రేఖ, విజయ, సరిత, లావణ్య, విజయలక్ష్మి, భాగ్య, జమున రాణి, నర్సు లు పాల్గొన్నారు.

## ఘనంగా సంతు గాడ్గే బాబా, 151వ జయంతి వేడుకలు

**.సూర్య బోయినిపల్లి..**



మండల కేంద్రంలో సంతు గాడ్గే బాబా, 151వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ,కార్యక్రమం మండల అధ్యక్షుడు ర్యాగల్ల అంజయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, పాల్గొని సంతు గాడ్గే బాబా, చిత్రపటానికి పూలమాలలు,వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సామాజిక సేవలను స్మరించుకున్నారు. సమాజంలో శుభ్రత, సమానత్వం, సేవా భావం, పెంపొందించడంలో ఆయన చేసిన కృషి విశేషమని, పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో,మహేష్, స్వామి కుమార్,మొండయ్య,రాజశేఖర్, వినోద్, శ్రీనివాస్, వెంకటేష్, రాజు, సాయి, మల్లేశం, జాన్ పాల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి సి ఎం కప్ యోగా పోటీలలో సిల్వర్ మెడల్ సాధించిన తాటిపల్లి గురుకుల విద్యార్థిని

**సూర్య మల్యాల**



ఈ నెల 21,22 తేదీలలో హైదరాబాద్ లోని సరూర్ నగర్ లో జరిగిన రాష్ట్ర స్థాయి సి ఎం కప్ యోగా పోటీలలో మల్యాల మండలం తాటిపల్లి గురుకుల పాఠశాల లో 9 వ తరగతి చదువుతున్న విద్యార్థిని టి.కమలిని రాష్ట్ర స్థాయి సి ఎం కప్ యోగా పోటీలలో బాగంగా ట్రెడిషనల్ విభాగంలో రాష్ట్రంలోనే ద్వితీయ స్థానం సాధించి సిల్వర్ మెడల్ సాధించినట్లు ప్రిన్సిపల్ మానస పి. ఈ. టి. బి. మధులికలు తెలిపారు. ఈ విద్యార్థిని పలుసార్లు రాష్ట్ర స్థాయి లో పాల్గొనడంతో పాటు ఒకసారి జాతీయ స్థాయి లో పాల్గొనడంతో పాటు ఇప్పుడు రాష్ట్ర స్థాయి లో సిల్వర్ మెడల్ సాధించినందుకు. విద్యార్థి కమల ని పి.ఈ.టి. మదులికను మండల విద్యాధికారి జయసింహారావు,ప్రిన్సిపల్ మానస, ఉపాధ్యాయులు అభినందించారు.